PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 117 | విజయవాడ, సోమవారం 28 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 28 November 2022 | Rs

రైతన్నా, నేనున్నా.. హామీ ఇచ్చా, అమలు చేస్తున్నా...

రైతన్నలకు నేడు అందిస్తున్న "ఇన్ పుట్ సబ్సిడీ",
"వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీ రాయితీ"
మొత్తం రూ. 200 కోట్లను బటన్ నొక్కి నేరుగా రైతన్నల ఖాతాల్లో జమ చేస్తున్న
గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..





ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే నష్ట పరిహారం చెల్లిస్తామన్న మాట మరోసారి నిలబెట్టుకుంటూ..

రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ

2022 జూలై-అక్టోబర్ మధ్య (ఖరీఫ్‌లో) కురిసిన అధిక వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన 45,998 మంది వ్యవసాయ, ఉద్యానవన రైతన్నలకు రూ. 39.39 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని ఖరీఫ్ 2022 ముగియక ముందే నేడు నేరుగా వారి ఖాతాలకు జమ..

నేడు జమ చేస్తున్న రూ. 39.39 కోట్లతో కలిపి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన 21.31 లక్షల మంది రైతన్నలకు అందించిన మొత్తం ఇన్‌పుట్ సబ్సిడీ అక్షరాల రూ. 1,834.78 కోట్లు..

ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతన్నలకు సత్వర ఉపశమనం కల్పిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్ ముగిసేలోగానే నష్ట పరిహారం పంపిణీ..

విపత్తుల సమయంలో జరిగిన నష్టానికి ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వం రైతులకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ...

పంట నష్ట కాలం	పరిహారం అందించిన తేది	రైతుల సంఖ్య	పెట్టుబడి సాయం (రూ. కోట్లలో)
2019-20 (భారీ వర్షాలు)	26th ఏప్రిల్, 2020	1.57 లక్షలు	123.70
ఏప్రిల్ - సెప్టెంబర్, 2020 (భారీ వర్షాలు)	27th అక్టోబర్, 2020	1.74 లక్షలు	146.24
అక్టోబర్, 2020 (భారీ వర్షాలు)	17th నవంబర్, 2020	1.97 లక్షలు	132.63
నవంబర్, 2020 (నివర్ తుఫాన్)	29th డిసెంబర్, 2020	8.34 లక్షలు	645.99
సెప్టెంబర్, 2021 (గులాబ్ తుఫాన్)	16th నవంబర్, 2021	0.35 లక్షలు	22.10
నవంబర్, 2021 (భారీ వర్షాలు)	15th ఫిబ్రవరి, 2022	5.97 లక్షలు	542.10
2018 (గత ప్రభుత్వం) లో తిత్లీ తుఫాన్ వల్ల నష్టపోయిన ఉద్యానవన పంటలకు అదనపు పరిహారం	22nd జూన్, 2022	0.91 లక్షలు	182.63
జులై - అక్టోబర్, 2022 (భారీ వర్షాలు)	28th నవంబర్, 2022	0.46 లక్షలు	39.39
మొత్తం సాయం		21.31 లక్షలు	1,834.78


పంటలు వేసే ప్రతిసారి రైతన్న పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీల వలలో చిక్కకూడదన్న ఉద్దేశంతో సన్న, చిన్నకారు రైతులతో పాటు వాస్తవ సాగుదారులకు పంట రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా..

వరుసగా మూడో ఏడాది

వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు

రబీ 2020-21, ఖరీఫ్ 2021 లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 8,22,411 మంది రైతన్నలకు రూ. 160.55 కోట్ల వడ్డీ రాయితీ సొమ్ము వారి ఖాతాల్లో నేడు నేరుగా జమ..

గత ప్రభుత్వం పెట్టిన బకాయిలు రూ. 1,180 కోట్లు, నేడు అందిస్తున్న రూ. 160.55 కోట్లతో కలిపి మన జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు "వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు" క్రింద 73.88 లక్షల మంది రైతన్నలకు అందించిన వడ్డీ రాయితీ రూ. 1,834.55 కోట్లు..



అన్నదాతలు అధిక వడ్డీలతో అప్పుల ఊబిలో కూరుకుపోకుండా వారికి అండగా నిలుస్తూ, ఈ-క్రాప్ డేటా ఆధారంగా లక్ష రూపాయల లోపు పంట రుణాలు తీసుకొని ఏడాది లోపు తిరిగి చెల్లించిన రైతన్నలకు పూర్తి వడ్డీ రాయితీని క్రమం తప్పకుండా అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

ఇది జగనన్న ప్రభుత్వం ఈ మూడేళ్ల ఐదు నెలల్లో రైతన్నలకు అందించిన సాయం...

పథకం	రైతుల సంఖ్య (లక్షల్లో)	ఆర్థిక సాయం (రూ. కోట్లలో)
వైఎస్సార్ రైతు భరోసా	52.38	25,971.33
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	44.28	6,684.84
ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ)	21.31	1,834.78
ధాన్యం కొనుగోలు (నేటి వరకు)		48,793.87
ఇతర పంటల కొనుగోలు (నేటి వరకు)		7,156.00
ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ		27,800.00
ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ		2,647.00
పగటి పూట 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకు ఫీడర్ల సామర్థ్యం పెంపుకు..		1,700.00
శనగ రైతులకు బోనస్		300.00
సూక్ష్మ సేద్యం, పండ్ల తోటల అభివృద్ధి	13.58	1,264.24
ఆయిల్ పామ్ రైతులకు సబ్సిడీ	0.32	85.47
వైఎస్సార్ యంత్ర సేవా పథకం		690.87
విత్తన సబ్సిడీ	60.76	1,023.52
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (మనం చెల్లించిన గత ప్రభుత్వ బకాయిలతో సహా)	73.88	1,834.55
మనం చెల్లించిన గత ప్రభుత్వ ధాన్యం సేకరణ బకాయిలు		960.00
గత ప్రభుత్వ కరెంటు బకాయిలు (మనం మన మీద వేసుకున్నది)		8,845.00
గత ప్రభుత్వం చెల్లించాల్సిన విత్తన బకాయిలు (మనం చెల్లించింది)		384.00
మొత్తం సాయం		**1,37,975.47**

శ్రీ. కాకాణి గోవర్ధన రెడ్డి, వ్యవసాయ, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ శాఖామాత్యులు

గత ప్రభుత్వం	మన ప్రభుత్వం
• అశాస్త్రీయంగా పంట నష్టాల అంచనా.. రైతన్నలు మధ్యదళారులు, క్షేత్రస్థాయి ఉద్యోగుల చుట్టూ ఏళ్ళ తరబడి తిరిగినా పరిహారం అందుతుందో లేదో తెలియని దుస్థితి.. కొన్ని సందర్భాల్లో పూర్తిగా ఎగ్గొట్టి, మరికొన్ని సందర్భాల్లో రెండు మూడు సీజన్ల తరువాతే సాయం అందించేవారు.. అదీ అరకొరగానే..	• ఈ-క్రాప్ డేటా ఆధారంగా శాస్త్రీయంగా పంట నష్టాలు అంచనా.. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ సోషల్ ఆడిట్ కొరకు రైతు భరోసా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన.. గ్రామ స్థాయిలోనే రైతులు తమ వివరాలు చూసుకొని, పేర్లు లేకపోతే ఫిర్యాదు చేసుకొనే వెసులుబాటు.. వెరిఫై చేసి పొరపాటు జరిగితే సరిదిద్దే కార్యక్రమం ..
• 2014 ఖరీఫ్‌లో వచ్చిన కరువుకు నవంబరు 2015లో, 2015 కరువుకు నవంబరు 2016లో, 2016 కరువుకు జూన్ 2017 లో, 2017 కరువుకు ఆగస్టు 2018 లో, 2018 పెథాయి సైక్లోన్ నష్టాలకు ఫిబ్రవరి 2019 లో సాయం.. అదీ అరకొరగా... • 2015 నవంబరు, డిసెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు జరిగిన రూ. 260.43 కోట్ల పంట నష్టానికి, 2018లో కరువు వల్ల ఖరీఫ్‌లో జరిగిన రూ. 1,832.28 కోట్ల పంట నష్టానికి, రబీలో రూ. 356.45 కోట్ల నష్టం అంటే మొత్తం రూ. 2,449.16 కోట్ల పంట నష్టానికి గాను అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ "సున్నా"..	• ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగా క్రమం తప్పకుండా ఇన్‌పుట్ సబ్సిడీ నేరుగా రైతన్నల ఖాతాల్లోనే జమ చేస్తున్న జగనన్న ప్రభుత్వం.. • మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడేళ్ల ఐదు నెలల్లో 21.31 లక్షల మంది రైతన్నలకు అందించిన ఇన్‌పుట్ సబ్సిడీ రూ.1,834.78 కోట్లు..
• కౌలు రైతులకు ఎలాంటి మేలు జరగలేదు..	• ఈ-క్రాప్ డేటా ఆధారంగా శాస్త్రీయంగా పంట నష్టాలు అంచనా వేసి కౌలు రైతులతో సహా వాస్తవ సాగుదార్లకు లబ్ధి..
• 2014 నుండి 2019 వరకు మొత్తం రూ.1,180.66 కోట్ల పంట రుణాల వడ్డీ రాయితీ సొమ్ము ఏటేటా బకాయిలు పెట్టిన వైనం.. పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన దుస్థితి..	• గత ప్రభుత్వ బకాయిలతో కలిపి ఈ మూడేళ్ల ఐదు నెలల్లో 73.88 లక్షల మంది రైతన్నలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల క్రింద అందించిన మొత్తం వడ్డీ రాయితీ రూ.1,834.55 కోట్లు..

గమనిక: రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి 28 నవంబర్, 2022 నాడు ఉదయం 11 గంటలకు సీఎం క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి "రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ", " వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల వడ్డీ రాయితీ" ని వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్ల లైవ్‌లో వీక్షించవచ్చు...

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రైల్వే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

రైల్వే స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ వాసుదేవ ఆచార్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా రైల్వేలో 8 లక్షలమంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వీరందరినీ తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని మాజీ పార్లమెంటు సభ్యులు, రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ వాసుదేవ ఆచార్య పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ ఆచార్య మాట్లాడుతూ కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి ఒక్కరికి నెలకు రూ.26వేలు జీతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్, ఇఎస్ఐసౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్క కార్మికుడు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు వివిఎల్ నరసింహులు, ఎఐఎల్ఆర్ఎస్ఎ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

టిడిపి దౌర్జన్యాలపై ఎందుకు మాట్లాడరు ?

పవన్‌కు మాజి మంత్రి పేర్నినాని ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం తమ ఇళ్లను కూల్చలేదని ఇప్పటం గ్రామప్రజలే చెబుతుంటే రాజకీయం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్న పవన్‌కల్యాణ్ టిడిపి ప్రభుత్వం అమరావతిలో పచ్చని పంటలపై విధ్వంసం సృష్టిస్తున్నపుడు ఎందుకు మాట్లాడలేదని మాజి మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. ఆదివారంనాడు వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కళ్లలో ఆనందం కోసమే పవన్‌కల్యాణ్ తాపత్రయపడుతున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల విద్వేషం తప్ప పవన్‌కల్యాణ్‌కు మరో అజెండాలేనట్లు వ్యవహరించడం తగదని అన్నారు. ఇప్పటంలో ప్రభుత్వం ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని ఆ గ్రామం పరువు తీసిందుకే పవన్‌కల్యాణ్ రోడ్డెక్కారని విమర్శించారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా వారికి బుద్ధిరాలేదని అన్నారు.

వైసిపి గడపలు కూలుస్తాం

పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి నాయకులు ఇప్పటం గ్రామ ప్రజల గడపలు కూల్చారని, వైసిపి గడపలు కూల్చే వరకు జనసేన పార్టీ నిద్రపోదని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అన్నారు మంగళగిరి లోని జనసేన కార్యాలయంలో ఇప్పటంలో ఇళ్లు కూల్చివేతకు గురైన 39మంది బాధితుల కుటుంబాలకు ఆదివారం ఆయన రూ. లక్ష వంతున చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కన్నీళ్ల మీద వైసిపి కడుతున్న ఫ్యూడలిస్టిక్ కోటలు బద్దలు కొట్టి తీరుతామన్నారు. ఇప్పటం గ్రామానికి తగిలిన దెబ్బ తన గుండెల మీద గాయం చేసిందన్నారు. రాజకీయాల్లో పట్టువిడుపులు ఉండాలని చెప్పారు. ఇప్పటం ప్రజలు జనసేనసభకు స్థలం ఇచ్చి అండగా నిలబడ్డారన్న కారణంతో ఇళ్లు కూల్చివేస్తారా? అని ప్రశ్నించారు. జనసేనను రౌడీసేన అని అంటున్నారని, మీరు చేతిలో తల్వారు పట్టుకుని మాజీ ఎంపి వైఎస్ వివేకానందరెడ్డిని చంపేస్తే, హంతకులకు మద్దతు తెలుపుతున్నారన్నారు. వైసిపి పార్టీనా, టెర్రరిస్ట్ ఆర్గనైజేషనా? అని ప్రశ్నించారు.

అన్నమయ్య ప్రాజెక్టు బాధితులకు అండగా ఉంటాం:

అన్నమయ్య ప్రాజెక్టు బాధితులకు అండగా నిలబడిన వారిని , వందలాది మంది ప్రాణాలు కాపాడిన నిజమైన హీరో లస్కర్ రామయ్య లాంటి వారిని సత్కరించుకున్న మమ్మల్ని ఏమంటారో ప్రజలకు తెలుసన్నారు. అక్కడి బాధితులకు ఎప్పటికీ అండగా ఉంటామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన సమయంలో సర్వం కోల్పోయిన నేషనల్ బాక్సర్ వంశీకృష్ణకు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు అండగా వుంటాం

రాష్ట్రంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం వారిపోరాటంకు అండగా వుంటామని పవన్‌కల్యాణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం పవన్‌కల్యాణ్‌ను కలిసి విజ్ఞప్తి చేసింది. డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సంఘం రాష్ట్ర అధ్యక్షులు దివి లీలారామారావు వివరించి వినతిపత్రం అందజేశారు. పవన్‌కల్యాణ్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి అడపా రమణ, కోశాధికారి గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

కాంట్రాక్టు లెక్చరర్, టీచర్ల సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలు నిర్వహించాల్సిందేనని, తద్వారానే ప్రభుత్వాలు కదులుతాయని ప్రభుత్వ విద్యాసంస్థల కాంట్రాక్టు, టీచర్ల సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. ఈ పోరాటాలకు తాము అండగా ఉంటామని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు, అధ్యాపక, ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేయాలని, గతంలో అమలు చేసిన 12 నెలల రెన్యువల్ ఉత్తర్వులు అమలు చేయాలని ఎపి ప్రభుత్వ విద్యాసంస్థల కాంట్రాక్టు లెక్చరర్లు, టీచర్ల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేస్తామని ప్రజాసంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన హామీ ప్రకారం షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. 2/1994 చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు సిబ్బంది చేసే పోరాటాలకు పిడిఎఫ్ తరపున అండగా ఉంటామన్నారు. స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్లు, టీచర్లు శ్రమదోపిడీకి గురవుతున్నారని అన్నారు. దినదిన గండంగా అభద్రతా భావంతో పనిచేస్తున్నారని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య మాట్లాడుతూ పోరాటాలతో సమస్యలు పరిష్కారం అవుతాయని, మరోమార్గం ద్వారా కాదన్నారు. ఒరిస్సా ఉద్యోగులు చేసిన పోరాట ఫలితం వల్లే వారిని రెగ్యులర్ చేస్తామని ఆరాష్ట్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. అరెస్టులకు భయపడొద్దని సిపిఎం అండగా ఉంటుందన్నారు. 12 నెలల వేతన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి నాయకులు,మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్లకు టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 12 నెలల వేతన విధానాన్ని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఎపి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పోరాటాలు ద్వారా అనేక సమస్యలను పరిష్కారం చేసుకున్నామని చెప్పారు. డిమాండ్లను సాధించుకునేందుకు అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని, ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం కావాలని కోరారు. ఫెడరేషన్ కో చైర్మన్ బిఎస్ఆర్ శర్మ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎన్జీవో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంవి కృష్ణ, సీనియర్ న్యాయవాది జివిఎల్ మూర్తి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్ల రెగ్యులర్ అసోసియేషన్ ఐవి రావు, ఎపి ప్రభుత్వ విద్యాసంస్థల కాంట్రాక్టు లెక్చరర్లు, టీచర్ల ఫెడరేషన్ బిజె గాంధీ, పి సాయిరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. క్రమబద్ధీకరణ కోసం సదస్సులు నిర్వహించాలని, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించాలని, మహిళలతో 36 గంటలు దీక్షలు నిర్వహించాలని, అప్పటికీ ఫలితం లేకపోతే పాదయాత్ర చేయాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు షేక్ సాబ్జీ , కత్తి నరసింహారెడ్డి

పరిశ్రమలకు ఇంధన సంరక్షణ అవార్డులు

- ఇంధన వారోత్సవాల్లో భాగంగా అందజేత
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంధన సరంక్షణ వారోత్సవాల్లో భాగంగా ఇంధన పరిరక్షణ అవార్డులను మూడో ఏడాది కూడా అందించనున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. డిసెంబర్ 14 నుంచి 20వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా వీటిని అందించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల్లో పెద్దఎత్తున చైతన్యం తీసుకురావటమే లక్ష్యంగా డిసెంబర్-2022 అవార్డుల కార్యక్రమాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, భవన నిర్మాణ రంగం, వివిధ వాణిజ్య, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో అమలు చేస్తున్న ఇంధన పరిరక్షణ కార్యక్రమాలను గుర్తించి వాటిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవార్డుల కార్యక్రమం వివిధ రంగాలకు చెందిన సంస్థల మధ్య ఇంధన పొదుపుపై ఆరోగ్యకరమైన పోటీని పెంచుతుందని ఆకాంక్షించారు. ప్రజల్లో చైతన్యం పెంచేందుకు, చౌక విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు, భవిష్యత్‌లో ఎదురయ్యే ఇంధన డిమాండ్‌ను అందుకునేందుకు, ఇంధన సామర్థ్య చర్యలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ లక్ష్యాల కోసం ఎపిఎస్ఈసిఎం పనిచేయాలని సూచించారు. పరిశ్రమలు, భవనాలు, మున్సిపల్ రంగాల్లోని వివిధ విభాగాల వినియోగదారులకు ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇంధన సంరక్షణ, సామర్థ్య కార్యక్రమాలు అమలు చేసే థర్మల్ విద్యుత్ కేంద్రాలు, సిమెంట్ పరిశ్రమలు, పట్టణ స్థానిక సంస్థలు, ప్రభుత్వ భవనాలు, కార్పొరేట్ కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, హోటళ్లు, ఆస్పత్రులు ఈ అవార్డుల పరిధిలోకి వస్తాయని వివరించారు. ఈ పరిశ్రమలు డిసెంబర్ 9వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఉద్యమం

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

మున్సిపల్ కార్మికులకు నష్టదాయకమైన ఆప్కాస్ రద్దుకు, పర్మినెంట్, ఇతర సమస్యల పరిష్కారానికి కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శని, ఆదివారాల్లో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మహాసభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి మూడున్నరేళ్లు అయినా ఆ హామీని నెరవేరలేదన్నారు. మున్సిపల్ రంగంతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ బానిస వ్యవస్థలో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, రూ.28 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ సంస్కరణల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులపై పనిభారం పెంచడం సరికాదని తెలిపారు. కరోనా సమయంలో పనిచేసిన కార్మికులకు తొమ్మిది నెలల జీతాలను నేటికీ చెల్లించకపోవడం శోచనీయమన్నారు. వచ్చే నెల 20, 21 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్ర మహాసభల సమస్యలపై చర్చించి పెద్దఎత్తున ఉద్యమం రూపొందిస్తామని తెలిపారు. విలేకర్ల సమావేశంలో జి.సుబ్బారావు, పి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చాగంటికి అవార్డు గురజాడకు అవమానం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి- విజయవాడ

గొప్ప దార్శనికుడు, అభ్యుదయ భావాలకు వేగుచుక్క, మహిళా పక్షపాతి అయిన మహాకవి గురజాడ అప్పారావు పేరిట నెలకొల్పిన పురస్కారాన్ని ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వాలనుకోవడం గురజాడ స్ఫూర్తిని అవమానించడమే అవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. చాగంటికి అవార్డు ఇచ్చే నిర్ణయాన్ని గురజాడ సాంస్కృతిక సమాఖ్య పునరాలోచించాలని డిమాండ్ చేశారు. మహాకవి గురజాడ అప్పారావు పేరిట అవార్డును చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు ఎ.సునీల్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ నెల 30న గురజాడ వర్ధంతిని పురస్కరించుకొని రచయితలు, కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు, ఆయా ప్రజాసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక కార్యక్రమం నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో 18 సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ వాణి వినిపించారు. గురజాడ రచనలను తిరస్కరించి, ఆయనను బహిష్కరించిన ఆధిపత్యవాదులే నేడు తమ మతభావ జాలకుడిగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ముందు తరాలను ముమ్ముందుకు నడిపే దూరదృష్టిలో గురజాడ రచనలు చేశారని, సమాజాన్ని వెనక్కు నడిపించే భావజాలకులకు ఆయన పేరిట పురస్కారం ఇవ్వడం తగదన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ మాట్లాడుతూ ఆనాడు సమాజంలో వేళ్లూనుకున్న అజ్ఞానాన్ని పారదోలడానికి గురజాడ గొప్ప రచనలు చేశారని తెలిపారు. కన్యాశుల్కం, సౌదామిని వంటి రచనల్లో మహిళల అభ్యున్నతిని కోరారని, వైజ్ఞానిక దృక్పథాన్ని ప్రదర్శించారని ఉదహరించారు. అలాంటి ముందుచూపుగల మహాకవి అవార్డును ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం అసమంజసం, అన్యాయమని అన్నారు. సినీ దర్శకులు సి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గురజాడ అవార్డును చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. అరసం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, ప్రోగ్రెసివ్ ఫోరమ్ - సంగమం నాయకులు తాజారావు, స్వరలయ వేదిక నిర్వాహకులు కొప్పుల అశోక్, హేతువాద సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్‌కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ లక్ష్మయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ నిర్వాహకులు డివి రాజు, జెవివి నాయకులు శ్రీనివాసరావు, తదితరులు ప్రసంగించారు. జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు సమన్వయకర్తగా వ్యవహరించారు.



రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన నాయకులు



సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ నూతన కార్యవర్గంతో మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగి రమేష్

సమస్యల పరిష్కారానికి రోడ్‌మ్యాప్

గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగులకు మంత్రుల హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రోడ్‌మ్యాప్ తయారు చేస్తోందని మంత్రులు చెప్పారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ (ఎపి జెఎసి అమరావతి అనుబంధం) ప్రథమ మహాసభ ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ఈ సభలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్లు, మ హిళా పోలీసుల బాధ్యతలు, సర్వీసు రూల్స్‌పై స్పష్టత లేదని, త్వరలో వీరి బాధ్యతలపై స్పష్టమైన సర్వీసు రూల్స్ ఇస్తూ పదోన్నతులు కల్పిస్తామన్నారు.శానిటేషన్ ఉద్యోగులకు కూడా వీక్లీ ఆఫ్‌లు త్వరలోనే అమల్లోకి తీసుకురానున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ మాట్లాడుతూ దేశం మొత్తం సచివాలయ వ్యవస్థను పెట్టాలని ప్రధాని మోడీ సైతం ఆలోచిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులుగా 32 ఏళ్లపాటు పనిచేసే అవకాశం లభించిందన్నారు. పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగు లకు తమ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం సలహాదారుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తాము కృషి చేస్తామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక:

రాష్ట్ర అధ్యక్షునిగా వేల్పుల ఆర్లయ్య, అసోసియేట్ అధ్యక్షునిగా అల్లపరెడ్డి సాయినాథ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా గాదె జ్యోతి, చతరాజుపల్లి భహరి, షేక్ షమీర్ హుస్సేన్, కన్నా డింపుల్ నాగ సుధీర్, జనరల్ సెక్రటరీగా పీనర గోవిందరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎపిడి సల్మాన్ భాష, జాయింట్ సెక్రటరీగా వనపాల పృధ్వీరాజ్, సానం బాంధవి, మేకల గంగయ్య, కట్టా శ్రీనివాసులు, కోశాధికారిగా బగ్గా జగదీష్‌బాబును ఎన్నుకున్నారు.

మహిళా రైతు కొండా ఉషారాణికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"ఆత్మనిర్భర్ భారత్ సుస్థిరాభివృద్ధి కోసం సైన్స్ అండ్ టెక్నాలజీలో మహిళల పాత్ర "అనే అంశంపై ఢిల్లీలో ఈనెల 24నుంచి26వ తేదీ వరకు జాతీయ సదస్సులో గుంటూరు జిల్లాకు చెందిన కొండా ఉషారాణికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించింది. ఈ మేరకు రైతు సాధికారసంస్థ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నీతీ ఆయోగ్, బయో టెక్నాలజీశాఖ, స్త్రీ శిశుసంక్షేమ మంత్రిత్వశాఖ, విగ్యాన్‌ప్రసార్, ఆత్మనిర్భర్ భారత్‌ల మద్దతుతో సైన్స్ అండ్ టెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఎంటర్‌ప్రైషర్ షిప్ ఎన్‌హ్యాన్స్‌మెంట్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా సరికొత్తసైన్స్‌ను వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు ఆమెకు దక్కింది. అవార్డును ఆదివారం ఆయుష్ సంయుక్త కార్యదర్శి ప్రమోద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

మత్స్యకారులను ఆదుకోండి

సిఎంకు టిడిపి ఎమ్మెల్యే అనగాని లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మత్స్యకారులను ఆదుకోవాలని టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌కు ఆదివారం ఆయన లేఖ రాశారు. మూడున్నరేళ్లుగా ఎటువంటి సంక్షేమ పథకాలు అందక, ప్రభుత్వం నుంచి సరైన ఆర్థిక ప్రోత్సహకాలు లేక మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. 2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమ కోసం రూ.788.38కోట్లు ఖర్చుచేశామని, ఈ మూడున్నరేళ్లల్లో పలానా ఖర్చుచేశామని ధైర్యంగా చెప్పగలరా అని నిలదీశారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు చంద్రన్న బీమా అమలు చేస్తే వాటికీ తూట్లు పొడిచారని మండిపడ్డారు. వేటకు వెళ్లి చనిపోయిన వారికి డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకపోవడం దుర్మార్గం కదా అని ప్రశ్నించారు. మత్స్యకార భరోసా పేరుతో చేసే సాయం గోరంత అని, విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచి వారి నుంచి లాక్కుంటోందని కొండంత అని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం మడ అడవులను కాపాడి వేలమందికి ఉపాధి కల్పిస్తే ధనార్జన కోసం వాటిని సర్వనాశనం చేశారని విమర్శించారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

సమిష్టి పోరాటంతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

సమిష్టి పోరాటంతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ తెలిపారు. ఉద్యమాలు, త్యాగాల ఫలితంగా ఏర్పాటైన కర్మాగారాన్ని కార్మికులు, ప్రజలు కలిసి కాపాడుకోవాల్సిన అవసరముందన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 654వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని ఎఐటియుసికి చెందిన కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూడడం దుర్మార్గమన్నారు. ఇన్ని రోజులుగా ఉద్యమం నడుస్తున్నా మోడీ సర్కారు స్పందించకపోవడం శోచనీయమన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ - 3లో ఉత్పత్తిని త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె రామకృష్ణ, కారు రమణ, ఆర్ శ్రీనివాసరావు, డివి రమణారెడ్డి, కె రాజబాబు, సిహెచ్‌వి సత్యనారాయణ, ఎస్.మురళీకృష్ణ, నందికి తాతారావు, గుమ్మడి నరేంద్ర, మంత్రి రవి పాల్గొన్నారు.



జయప్రదను సన్మానిస్తున్న రామకృష్ణ, ఆలపాటి, బుర్రా సాయిమాధవ్ తదితరులు

సామాన్యులను రాజకీయాల్లోకి తెచ్చిన ఎన్‌టిఆర్

- లోక్‌సత్తా నేత జయప్రకాష్‌నారాయణ
- జయప్రదకు ఎన్‌టిఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారం

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

పెత్తందార్లకే పరిమితమైన రాజకీయాలను జనం మధ్యకు తెచ్చిన గొప్ప వ్యక్తి నందమూరి తారక రామారావు అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో శకపురుషుని శతజయంతి పేరుతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తోన్న ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా ఎన్‌టిఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కార ప్రదానోత్సవం ఆదివారం రాత్రి నాజరుపేటలోని ఎన్‌విఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. ఆలపాటి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ డి.శారద జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన నటుడు సూపర్ స్టార్ కృష్ణ మృతికి మౌనం పాటించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ కళాకారునిగా ఎన్‌టిఆర్ ప్రస్థానం తెలుగు వారికి కీర్తికి తెస్తే, రాజకీయంగా పాలనా వైవిధ్యాన్ని చాటుకుని తెలుగు భాషకు మంచి గుర్తింపు తెచ్చారని కొనియాడారు. దర్శకులు ఎ.కోదండరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్‌టిఆర్ నటించిన సింహబలుడు చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశానని, ఆయన ఎంతో నిబద్ధత కలిగిన వ్యక్తని తెలిపారు. అనంతరం ఎన్‌టిఆర్ శతాబ్ది చలనచిత్ర పురస్కారాన్ని నటి జయప్రదకు ఎన్‌టిఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం నటులకు ఎన్‌టిఆర్ ఓ డిక్షనరీ అని అన్నారు. ఆయన జ్ఞాపకాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. జయప్రద మాట్లాడుతూ సినీ రంగంలో ఎన్‌టిఆర్‌తో తనకున్న అనుబంధం, రాజకీయంగా సాన్నిహిత్యాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలుగు చలనచిత్ర రంగంలో ఆయన ప్రస్థానం గొప్పదని, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రభంజాన్ని సృష్టించిన ఘనుడని కొనియాడారు. ఆ మహనీయుని పేరిట పురస్కారాన్ని తెనాలి గడ్డపై అందుకోవడం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమకంలో సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, ఎన్‌టిఆర్ అభిమాని పురస్కార గ్రహీత మైథిలి అబ్బరాజు, షాబీర్‌షా, షేక్ జానిబాషా, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, ఎ.విజయ, టి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

వైద్య రంగాన్ని భ్రష్టుపట్టించిన జగన్

టిడిపి అధికార ప్రతినిధి గ్రీష్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యరంగాన్ని సిఎం వైఎస్ జగన్ భ్రష్టుపట్టించారని టిడిపి అధికార ప్రతినిధి కావలి గ్రీష్మ అన్నారు. నాడు-నేడు కింద వైద్యరంగంలో విప్లవం తీసుకొస్తున్నామని చెబుతున్న సిఎం మాటలు ఆచరణలో అమలు కాక పేదలు వైద్యం కోసం నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎపి వైద్య విధానం దేశానికే ఆదర్శమని ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

క్షేత్రస్థాయిలో ప్రభుత్వాస్పత్రులను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు కళ్లకు కడతాయని తెలిపారు. నీతి ఆయోగ్ హెల్త్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో ఇంక్రిమెంట్ ర్యాంకు 10వ స్థానానికి పడిపోవడమే ఆదర్శంగా నిలపడమా అని మంత్రిని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చారని విమర్శించారు. సిఎంఆర్ఎఫ్‌ను ఐసియూలోకి నెట్టేశారని పేర్కొన్నారు. కొత్తమెడికల్ కళాశాలల పేరుతో జగన్నాటకాలు ఇంకెన్నాళ్లని ప్రశ్నించారు. గిరిజనులకు వైద్యం అందని ద్రాక్షేనని పేర్కొన్నారు.

సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు: ప్రణవ్ గోపాల్

సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ విమర్శించారు. ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా గాలికొదిలేసిందని పేర్కొన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిఎం జగన్‌కు ఆదివారం లేఖ రాశారు. తాగునీరు, గదులలో ఫ్యాన్లు, దోమతెరలు, ప్లేట్లు వంటి కనీస వసతులు కూడా లేక దీనస్థితిలో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇంతటి దుర్భర పరిస్థితులలో పేద విద్యార్థులు తమ చదువులు కొనసాగించడం అసాధ్యమని పేర్కొన్నారు. వెంటనే స్పందించి తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ దీపాల సౌకర్యం, మరమ్మతులు, కిటికీలు, దోమతెర నెట్‌లు ఏర్పాటు చేసలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాకు సంబంధం లేదు

- 'కోటంరెడ్డి'పై దాడి ఘటనపై ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు పట్టణ టిడిపి ఇన్‌ఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని కారుతో ఢీకొట్టి గాయపరచిన ఘటనతో తనకు ఎటువంటి సంబంధమూలేదని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. నెల్లూరులోని మైపాడు గేట్ సెంటర్‌లో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. కారు దాడి ఘటనపై పోలీసులు స్పందించారని, గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. శ్రీనివాసులురెడ్డిని కారుతో ఢీకొట్టారన్నది అవాస్తమని పేర్కొన్నారు. ఈ దాడిలో తనపై అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమని అన్నారు. ఆరోపణలు చేసే ముందు సిసి పుటేజీ పరిశీలిస్తే అసలు విషయాలు తెలుస్తాయని చెప్పారు. శ్రీనివాసులురెడ్డిపై జరిగిన దాడి దారుణమని, ఈ ఘటనను తాను ఖండిస్తున్నానని తెలిపారు.

దేశం ప్రమాదంలో పడింది

- సమైక్యత కోసం పోరాటం తప్పదు
- టెకిన్ ఫర్ ఎ బెటర్ ఇండియా కార్యక్రమంలో సీతారాం ఏచూరి

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 117 | విజయవాడ, సోమవారం 28 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 28 November 2022 | Rs



మెస్సీ మ్యాజిక్

- 25 గజాల దూరం నుంచి గోల్
- 2-0తో మెక్సికోపై అర్జెంటీనా గెలుపు

పేజీలో...

బిజెపిని వణికిస్తున్న ఒపిఎస్

గుజరాత్‌లో కాంగ్రెస్, ఆప్ హామీలు

రంగంలోకి నీతిఆయోగ్



న్యూఢిల్లీ : పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్) అమలు చేయాలన్న నినాదం బిజెపిని వణికిస్తోంది. మన రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఒపిఎస్ కోసం గళం విప్పుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ డిమాండ్ ఎన్నికల అంశంగా మారుతోంది. తాజాగా గుజరాత్ ఎన్నికల్లోనూ ఒపిఎస్ అంశం ముందుకొచ్చింది. తాము అధికారంలోకి వస్తే ఒపిఎస్‌ను పునరద్ధరిస్తామని కాంగ్రెస్, ఆప్‌లు ప్రకటించాయి. ఆదివారం గుజరాత్‌లో పర్యటించిన ఆప్ అధినేత కేజ్రీవాల్ సైతం ఇదే అంశాన్ని ప్రస్తావించారు. పంజాబ్‌లో తాము ఒపిఎస్‌ను అమలు చేస్తున్నామని, గుజరాత్‌లోనూ అధికారం అప్పగిస్తే జనవరి 31లోగా ఒపిఎస్‌ను అమలులోకి తీసుకవస్తామని ఆయన ప్రకటించారు. అంతకుముందే కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చింది. భారత్ జోడో యాత్రకు విరామం ఇచ్చి, ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తన ప్రసంగాల్లో ఒపిఎస్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. తాము అధికారంలోఉన్న రాజస్థాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గడ్‌లలో రాష్ట్రాల్లో దీనినే అమలు చేస్తున్నామని, గుజరాత్‌లో గెలిపిస్తే ఇక్కడ కూడా అదే విధానాన్ని తీసుకువస్తామని ప్రకటించారు. ఉద్యోగులపై ఇది పెద్దఎత్తున ప్రభావం చూపే అవకాశం ఉందన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నీతిఆయోగ్ అనూహ్యంగా రంగంలోకి దిగడం వివాదాస్పదంగా మారింది. ఆ సంస్థ వైస్ ఛైర్మన్ సుమన్ బేరి ఒపిఎస్ దేశానికి హాని చేస్తుందంటూ ఆదివారం ప్రకటన చేశారు. 27 సంవత్సరాలుగా గుజరాత్‌లో అధికారంలోఉన్న బిజెపి తాజా ఎన్నికల్లో గిరిజనుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కుంటోందన్న వార్తలు వెలువడుతున్నాయి. ఆ రాష్ట్రంలోని దాదాపు 47 నియోజకవర్గాల్లో గిరిజనులు నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. వీటిలో రిజర్వుడు సీట్లే 27 ఉన్నాయి. వీరిని బుజ్జగించడానికే నానా తిప్పలు పడుతున్న వేళ ఒపిఎస్ అంశం కూడా ఎన్నికల్లో బలంగా ముందుకు రావడం బిజెపి నేతలను కలవరపరుస్తోంది.

ఎందరు ఉద్యోగులు...

గుజరాత్‌లో దాదాపుగా 7 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వీరిలో 70 వేల మంది ఉపాధ్యాయులన్నారని అంచనా! వీరంతా కొన్ని సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ బిజెపి రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో పాటు పెద్ద ఎత్తున అణచివేత చర్యలకు పాల్పడింది. కాంగ్రెస్, ఆప్‌ల హామీలతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. కొద్ది రోజుల క్రితం పోలింగ్ జరిగిన హిమాచల్‌ప్రదేశ్‌లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఆ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్, ఆప్‌లు ఒపిఎస్ పునరుద్ధరణకు హామీలు ఇచ్చాయి. దీంతో బిజెపికి ఉద్యోగులు దూరమయ్యారన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

నీతి ఆయోగ్ ఏమంది...?

ఒపిఎస్ పునరుద్ధరణపై ఆదివాంర స్పందించిన నీతిఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ భేరీ దేశ ఆర్థిక వ్యవస్థకు మంచి చేయదని అన్నారు. దీనివల్ల భవిష్యత్తులో పన్ను చెల్లింపుదారులపై భారం పడుతుందని చెప్పారు. ఆర్థిక పరిపుష్టి, సుస్థిర అభివృద్ధిని సాధించాల్సిన ప్రస్తుత సమయంలో ఈ తరహా చర్యలు సబబుకావన్నారు.



గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా

ఈజిప్టు అధ్యక్షులు అల్ సిసి

న్యూఢిల్లీ : భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఈ దఫా ఈజిప్టు అధ్యక్షులు అబ్దుల్ ఫత్తాహ్ అల్ సిసి హాజరుకానున్నారు. ఈ మేరకు విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆదివారం ప్రకటించింది. కోవిడ్ నేపథ్యంలో 2021, 2022 సంవత్సరాల్లో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకలకు విదేశీ ప్రముఖులను ఆహ్వానించలేదు. 2020 తర్వాత మళ్లీ విదేశీ అధినేతను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ఇదే తొలిసారి. అరబ్ రిపబ్లిక్ ఆఫ్ ఈజిప్టు అధ్యక్షుడిని గణతంత్ర వేడుకలకు ఆహ్వానించడం కూడా ఇదే ప్రథమమని విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ తన ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పంపిన ఆహ్వానపత్రాన్ని విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జయశంకర్ గత అక్టోబరు 16న ఈజిప్టు అధ్యక్షులు సిసికి అందజేశారని పేర్కొంది. ఇరు దేశాలు ఈ ఏడాది 75వ వార్షిక దౌత్య సంబంధాల వేడుకలను చేసుకుంటున్న నేపథ్యంలో భారత్ ఈ ఆహ్వానాన్ని పంపింది. భారత్, ఈజిప్టు మధ్య స్నేహపూర్వక సంబంధాలు, దౌత్య సంబంధాలు కొనసాగుతున్నాయని, ప్రజలకు, ప్రజలకు మధ్య కూడా బంధాలు బలోపేతం అవుతాయని విదేశాంగ శాఖ పేర్కొంది. భారత గణతంత్ర వేడుకల్లో మిత్ర దేశాల అధినేతలను ఆహ్వానించడం 1950 నుంచి కొనసాగుతోంది. 2020లో బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బొల్సనారో హాజరయ్యారు. 2015లో నాటి అమెరికా అధ్యక్షులు బరాక్ ఒబామా, 2007లో రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్, ఫ్రెంచ్ మాజీ అధ్యక్షులు నికోలస్ సర్కోజి (2008), ఫ్రాంకోసిస్ హొలాండే (2016)లో ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.

కిస్తు కిస్తుకూ కోత

- లక్షల మందికి పిఎం కిసాన్ దూరం చేస్తున్న కేంద్రం
- భరోసాతో లింక్ ఉన్నా అడగని రాష్ట్ర సర్కారు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతుల కోసం కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం కిసాన్)ని పొందుతున్న మన రాష్ట్రంలోని లబ్ధిదారుల సంఖ్య అంతకంతకూ కోతలకు గురవుతోంది. కిస్తుకు రూ.రెండు వేల చొప్పున మూడు కిస్తులకూ కలిపి ఏడాదికి రూ.ఆరు వేలు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ కావాలి. కాగా కిస్తు కిస్తుకు లబ్ధి పొందే రైతులు తగ్గిపోతున్నారు. మోడీ ప్రభుత్వం విధిస్తున్న కొత్త కొత్త నిబంధనల వలన అన్నదాతలు చిన్నపాటి సర్కారీ సాయానికీ దూరమవుతున్నారు. సంవత్సరంలో నాలుగు మాసాలను ఒక పిరియడ్‌గా పేర్కొని ఒక్కో పిరియడ్‌కు రూ.రెండు వేల వంతున నగదు బదిలీ చేస్తున్నారు. ఏప్రిల్-జులై, ఆగస్టు-నవంబర్, డిసెంబర్-మార్చి గా వర్గీకరించారు. నిరుడు 2021-22 చివరన డిసెంబర్-మార్చి కాలానికి ఆంధ్రప్రదేశ్‌లో 47,64,482 మందికి రూ.రెండు వేల చొప్పున జమ పడ్డాయి. ఈ ఆర్థిక సంవత్సరం 2022-23 తొలి కిస్తు ఏప్రిల్-జులై కి 46,62,768 మందికి సొమ్ము పడింది. అంతకుముందు కిస్తు పొందిన వారిలో ఈ ఏడాది తొలి కిస్తు 1,01,714 మందికి పడలేదు. ఈ తగ్గుదల ఇలా ఉండగా ఈ సంవత్సరం రెండవ కిస్తు 42,02,640 మందికే జమ అయింది. మొదటి కిస్తు కంటే 4,60,128 మంది లబ్ధి దారులు తగ్గిపోయారు. రెండవ కిస్తు పడాల్సిన సమయం జులై-నవంబర్. నవంబర్ నెల ముగియడానికి నాలుగు రోజులే సమయముంది. దాంతో లక్షల మంది రైతన్నలు పిఎం కిసాన్ సొమ్ము కోసం బ్యాంకుల చుట్టూ చెప్పులరిగిపోయేలా తిరుగుతున్నారు.

ఎప్పుడూ లేదు

గత సార్వత్రిక ఎన్నికల ముంగిట 2018 డిసెంబర్ నుంచి పిఎం కిసాన్ పథకం మొదలుకాగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏనాడూ నమోదు చేసుకున్న రైతులందరికీ సొమ్ము పడలేదు. ఎపిలో 60,66,195 మంది రిజిస్టర్ చేయించుకోగా వారిలో దాదాపు 10-15 లక్షల మందికి అందట్లేదు. కేంద్రం కౌలు రైతులకు మొత్తానికే సాయం చేయనంది. కేవలం స్వంత భూమి కలిగిన రైతులకే లబ్ధి అంది. ఆదాయపన్ను చెల్లించేవారిని, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు వంటి ప్రొఫెషనల్స్‌ను, ప్రభుత్వ ఉద్యోగులను, పెన్షన్ తీసుకునేవారిని, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిని, మాజీలను అనర్హులుగా ప్రకటించింది. రెవెన్యూ రికార్డులు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ అంది. ఇప్పుడేమో ఇ-కెవైసి తప్పనిసరి చేసింది. రోజుకో షరతు పెట్టడంతోపాటు సాంకేతిక సమస్యల కారణంగా లక్షల మంది రైతులు లబ్ధి పొందలేకపోతున్నారు.

పిఎం కిసాన్ కోతలు

నమోదైన లబ్ధిదారులు	60,66,195
డిసెంబర్-మార్చి కిస్తు	47,64,482
ఏప్రిల్-జులై కిస్తు	46,62,768
ఆగస్టు-నవంబర్ కిస్తు	42,02,640

నవరత్నానికి బీటలు

ప్రతి ఏడాదీ ఖరీఫ్‌కు ముందే 'వైఎస్‌ఆర్ రైతు భరోసా' పేరిట రూ.12,500 ఒకేసారి రైతు చేతిలో పెడతామని ఎన్నికల ముందు వైసిపి హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చాక సాయాన్ని రూ.13,500 చేసి, కేంద్ర పథకం పిఎం కిసాన్‌తో కలిపి అమలు చేస్తోంది. ఒకేసారి కాకుండా సంవత్సరంలో మూడు కిస్తుల్లో ఇస్తోంది. కేంద్రం రూ.6 వేలు, రాష్ట్రం రూ.7,500 కలిపి మొత్తం రూ.13,500గా లెక్క చెప్పింది. కేంద్ర నిబంధనల వలన పిఎం కిసాన్ లబ్ధి లక్షలాది మంది రైతులకు అందట్లేదు. రాష్ట్రం ఇచ్చే రూ.7,500 మాత్రమే జమ అవుతున్నాయి. కొంత మందికి రెండు సాయాలూ పడట్లేదు. రాష్ట్ర సర్కారు లబ్ధిదారుల జాబితాలు కేంద్రానికి పంపినా అక్కడ ఆగిపోతున్నాయి. లక్షల మందికి 'పిఎం కిసాన్' పడకపోయినా కేంద్రాన్ని ఎపి సర్కారు గట్టిగా అడగట్లేదని విమర్శలొస్తున్నాయి.

పోరాటాలకు సిద్ధం కండి

- కార్మికులకు తపన్‌సేన్ పిలుపు



లేబర్‌కోడ్‌లు-కనీసవేతనాలు- కార్మికులు అనే అంశంపై సదస్సులో మాట్లాడుతున్న తపన్‌సేన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నో త్యాగాలతో సాధించుకున్న హక్కులను పరిరక్షించుకునేందుకు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికలోకానికి సిఐటియు జాతీయ ప్రధానకార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. 2023 జనవరి 2,3,4 తేదీలలో జరుగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో ఆదివారంనాడు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ నండూరి ప్రసాదరావు స్మారక ప్రాంతీయ సదస్సు జరిగింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగ్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో లేబర్‌కోడ్‌లు-కనీసవేతనాలు- కార్మికులు అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో మొదట నండూరి ప్రసాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం తపన్‌సేన్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం లేబర్‌కోడ్‌ల పేరుతో కార్మికహక్కులను నిర్వీర్యం చేసేలా దాడులు చేస్తోందని అన్నారు. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యంలో కార్మికులపై దోపిడి మరింత పెరుగుతోందన్నారు. కార్మికులకు అత్యంత ప్రధానమైన కనీస వేతనాలను ఎక్కడా అమలు చేయడం లేదని విమర్శించారు. 1992లో సుప్రీంకోర్టు తీర్పు మేరకు 2015లో 6వ పేకమిషన్ ప్రకారం కనీసవేతనంను రూ 18వేలుగా నిర్ణయించారని, ప్రస్తుత ధరలకు అనుగునంగా కనీసవేతనంగా రూ 26వేలు వుండాలని చెప్పారు. ఈ వేతనం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. దేశంలో జాతీయోద్యమకాలం నుండి కార్మికులు పోరాడిసాదించుకున్న 29 కార్మిక చట్టాలను నరేంద్రమోడి ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని అన్నారు. కార్పోరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకే కార్మికుల హక్కులన్నింటిని హరించివేశారని అన్నారు. దేశసంపదను కార్పోరేట్‌లకు దోచిపెట్టే ఈ విధానాలను ప్రతిఘటించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి యంఎ గఫూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసంఘటిత రంగంలోని కార్మికులకే కాదు ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా కనీసవేతనాలు అందడం లేదన్నారు. కనీస వేతనంగా రూ26వేలు ఇవ్వాలని కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ సెమినార్‌లో ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు సిహెచ్ రామారావు, హెచ్‌ఎంఎస్ ప్రధానకార్యదర్శి జిఎస్ శ్రీనివాసరావు, శ్రామిక మహిళా సంఘం నాయకులు కె సుబ్బరావమ్మ తదితరులు మాట్లాడుతూ కనీస వేతనాల సలహాబోర్డును వెంటనే వేయాలని, 26 వేల రూపాయల కనీసవేతనాన్ని అమలులోకి తీసుకురావాలని కోరారు. రాబోయే రోజుల్లో కనీస వేతనాల సాధన కోసం కార్మికసంఘాలు ఇచ్చే పిలుపును జయప్రదం చేయాలని కోరారు.

మూడో ఏటా ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులకు అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ సున్నా వడ్డీ నిధులను మూడో ఏటా కూడా చెల్లింపులకు సిద్ధమవుతోంది. సున్నా, ఇన్‌పుట్ సబ్సిడీలతో పాటు ఇప్పటిదాకా పథకాల అమలు నోచుకోని వారికి కూడా కలిపి మొత్తం రూ 200 కోట్లను సోమవారంనాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంనుండి బటన్‌నొక్కి రైతుల ఖాతాల్లోకి జమచేయనున్నారు. ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే నష్టపరిహారం చెల్లిస్తామని గతంలో సిఎం ప్రకటించిన విషయం తెలిసిందే.

2022 జులై నుండి అక్టోబర్ మధ్య కురిసిన అధిక వర్షాలు, వరదలకు పంట నష్టపోయిన 45,998 మంది వ్యవసాయ, ఉద్యానవన రైతన్నలకు రూ 39.39 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని తాజాగా జమచేయనున్నారు. దీంతో ఈ మూడున్నర ఏళ్లలో మొత్తం ఇన్‌పుట్ సబ్సిడీ అక్షరాల రూ 1,834.79 కోట్లను అందించినట్లు అవుతుంది. పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 8,22,411 మంది రైతన్నలకు రూ 160.55 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును కూడా వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సాహితీవేత్తలు, కవులు, రచయితలు

చాగంటికి గురజాడ పురస్కారం అభ్యంతరకరం

- విజయనగరంలో సాహితీవేత్తలు, కవులు, కళాకారుల ర్యాలీ

ప్రజాశక్తి- విజయనగరం కోట

మూఢనమ్మకాలను పెంచిపోషిస్తోన్న చాగంటి కోటేశ్వరరావుకు ప్రతిష్టాత్మక గురజాడ విశిష్ట పురస్కారాన్ని ప్రకటించడాన్ని నిరసిస్తూ విజయనగరంలో సాహితీవేత్తలు, కవులు, కళాకారులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ అవార్డును వెనక్కి తీసుకోవాలని కోరుతూ సాహితీ స్రవంతి, జెవివి, పలు సాహితీ సంఘాల ఆధ్వర్యాన గురజాడ గౌరవ యాత్ర చేపట్టారు. గురజాడ నివాసం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర మూడు లాంతర్లు, గంట స్తంభం, ఎంఆర్ కళాశాల మీదుగా కోట వరకూ సాగింది. అనంతరం అక్కడి గురజాడ విగ్రహానికి డీసెంట్ నోట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, చీకటి దివాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, నార్ని వెంకటసుబ్బయ్య తదితరులు మాట్లాడారు. సమాజాభివృద్ధిని కాంక్షిస్తూ గురజాడ ఎన్నో రచనలు చేశారన్నారు. స్త్రీ జాతి అణచివేతకు వ్యతిరేకంగానూ, స్త్రీ జాతి ఔన్నత్యాన్ని వివరిస్తూ తన కవితల ద్వారా సమాజాన్ని మేల్కొల్పారని తెలిపారు. అభ్యుదయవాది గురజాడ పురస్కారాన్ని, దానికి విరుద్ధ భావాలు ప్రచారం చేస్తోన్న చాగంటి కోటేశ్వరరావుకు ఇవ్వడం సరికాదన్నారు. ఇది గురజాడకు, చాగంటికి మధ్య వైరం మిగతా 5లో

అనకాపల్లిలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - యలమంచిలి రూరల్ (అనకాపల్లి జిల్లా)

కారు ఢీకొని ముగ్గురు మృతి చెందిన సంఘటన అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం రేగుపాలెం జంక్షన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. యలమంచిలి మండలం పద్మ నాభరాజుపేటకు చెందిన ఎడ్ల గోవిందరావు (50) స్కూటీపై ఇంటికి వస్తున్నారు. అదేసమయంలో తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం ప్రాంతానికి చెందిన భీశెట్టి కుమారి (38), మొల్లేటి శివాజీ రోడ్డు పక్కగా నడిచివెళ్తున్నారు. విశాఖ వైపు నుంచి విజయవాడవైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి తొలుత స్కూటీపై వెళ్తున్న గోవిందరావును ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న ఇద్దరిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో స్కూటీని నడిపే వ్యక్తితోపాటు.. ఇద్దరు పాదచారులు అక్కడికక్కడే మృతి చెందారు. సిఐ గఫూర్ ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు గోవిందరావు బంధువులు, స్థానికులు ప్రమాద స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ రహదారిపై బైఠాయించారు. సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కెవిపిఎస్ రాష్ట్ర మహాసభకు కర్నూలు సిద్ధం



ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర 4వ మహాసభ కర్నూలులో సోమ, మంగళవారాల్లో జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాసభ వేదికను సిద్ధం చేశారు. సోమవారం ఉదయం కిసాన్ ఘాట్ నుండి రాజ్ విహార్ కూడలి మీదుగా ఓల్డ్ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్‌లో బహిరంగ సభ జరగనుంది. ర్యాలీ, బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా కేరళ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి, దళిత్ సోషన్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ అధ్యక్షులు కె.రాధాకృష్ణన్, డిఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఉమ్మడి రాష్ట్ర కెవిపిఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ హాజరు కానున్నారు. మధ్యాహ్నం నుండి గోల్డెన్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ నిర్వహించనున్నారు. మహాసభ కోసం కర్నూలులో రోడ్డు పొడవునా కెవిపిఎస్ జెండాలు, తోరణాలతో అలంకరించారు.

భూకమతాల సర్వే మందగమనం

- కౌలు రైతులుగా సిసిఆర్‌సి ఉన్న వారినే గుర్తింపు
- నెరవేరని వాస్తవ సాగుదారుల గుర్తింపు లక్ష్యం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

దేశంలో వాస్తవ సాగుదారులను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే రాష్ట్రంలో మందగమనంగా సాగుతోంది. 11వ వ్యవసాయ గణనలో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కొత్త వెబ్ పోర్టల్‌ను రాష్ట్రాలకు పంపింది. ప్రామాణిక సంవత్సరం 2021-22 ఆధారంగా గ్రామ రికార్డులను ఈ యాప్‌లో నింపి వ్యవసాయ గణన చేపట్టేందుకు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి సర్వే ప్రారంభించారు. వ్యవసాయ కమతాల స్వరూప స్వభావాలను, పరిమాణ తరగతుల వారీగా కమతాల సంఖ్య, వాటి విస్తీర్ణం, భూ వినియోగంపై ప్రతి ఐదేళ్లకు ఒకసారి భూకమతాల గణన పేరుతో సర్వేను చేపడుతున్నారు. అభివృద్ధి ప్రణాళికలు, సామాజిక, ఆర్థిక ప్రణాళిక తయారీకి, జాతీయ ప్రాధాన్యత అంశాల తయారీకి ఈ సర్వే ఉపయోగపడుతుందని కేంద్రం తన సర్క్యులర్‌లో పేర్కొంది. పరిమాణ తరగతులు, సామాజిక తరగతులు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, స్త్రీ, పురుషుల వారీగా సమాచారం పంపాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో వ్యవసాయ గణన అధికారి, జిల్లా ప్రణాళిక శాఖ అర్థ గణాంక శాఖాధికారి ఆధ్వర్యంలో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ గణనలో వ్యక్తిగత, సమిష్టి, సంస్థాగత కమతాల వివరాలను రైతులను నుంచి సేకరించాల్సి ఉంది. 11వ వ్యవసాయ గణనలో భూ యజమాని, కౌలుదారుని వివరాలు కూడా పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయించారు. మొదటి దశలో కమతాల వారీగా విస్తీర్ణం, సామాజిక తరగతి, సాగుదారుల లింగభేదాల వివరాలతో సర్వే పూర్తి చేయాలి. ఈ ఏడాది డిసెంబరు చివరి నాటికి సర్వే పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించింది. రాష్ట్రంలో మొత్తం 2,19,24,721 కమతాలు ఉన్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు 21,87,240 కమతాల వివరాలను మాత్రమే యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వాస్తవంగా ఉన్న మార్గదర్శకాల ప్రకారం రైతులను, కౌలు రైతులను కలిసి వారితో మాట్లాడి వివరాలు నమోదు చేయాలి. కానీ రెవెన్యూ అధికారులు తమ వద్ద ఉన్న డేటాను యథాతథంగా కేంద్రం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ డేటా నమోదులో కూడా మందగమనం కొనసాగుతోంది. ఇంకా 1,97,37,481 కమతాల వివరాలు నమోదు చేయాలని అధికార వర్గాలు తెలిపాయి. వాస్తవ సాగుదారుల గుర్తింపులో కూడా అనేక లోపాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా 2019 కౌల్దార్ల గుర్తింపు చట్టం ప్రకారం సాగు ధ్రువీకరణ పత్రం (సిసిఆర్‌సి) ఉన్న వారినే కౌలు రైతులుగా నమోదు చేస్తున్నారు. వాస్తవంగా భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నా సిసిఆర్‌సి లేకపోతే ఈ వివరాలు నమోదు కావడం లేదు. క్షేత్రస్థాయిలో భూములను సందర్శించి వివరాలు నమోదు చేయకుండా గ్రామ సచివాలయాల్లోనే విఆర్‌ఒలు తమ వద్ద ఉన్న వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం వీటిని నమోదు చేస్తున్నారన్న విమర్శ ఉంది. ఎస్‌సి, ఎస్‌టిలు, మహిళలు, పురుషులు, చిన్న, సన్నకారు రైతులు, రెండున్నర ఎకరాల దాటి ఉన్న మధ్య తరహా రైతులు, పది ఎకరాలు మించి ఉన్న భూ యజమానులను వేర్వేరుగా గుర్తించారు. కనిష్టంగా పది సెంట్ల వ్యవసాయ భూమి ఉన్నా వారిని కూడా గుర్తించాలని నిర్ణయించారు.





వెనుక చూసిన కార్యమేమోయి/
మంచి గతమును కొంచెమేనోయి/
మందగించక ముందు అడుగేయి/
వెనకబడితే వెనకేనోయ్.

- మహాకవి గురజాడ



చలి మంట


చెలరేగే చెట్ల కొమ్మల్లోంచి
ఊసులాడే ఆకుల సందుల్లోంచి
ముసిముసిగా నవ్విన కిరణాలు
ఒకింత చూపుల్ని ఒంపుతున్నాయి .

కరుణించని చలి
కొత్తగా కొరుకుతుంది
నిద్ర నుంచి లేవాలనే ఉంటుంది
గాలికి ఎదురీదాలనే ఉంటుంది
చెవుల్లో గాలులు గంతులేస్తున్నాయి.

మనసులో తపనలు
మధన పడుతుంటాయి
కాలాలు జారినపుడు
పూల పరిభాషలో వేసుకుంటాను
ఆకాశం రంగులు పులుముకున్నట్లు
కలల ప్రపంచంలో రంగుల పక్షిలా ఎగురుతాను
పిల్ల కాలువ నీటిలా
చలి చలిగా వొణుకుతుంటాను

తెల్లవారు చలిమంట కోసం
ఎండిన ఆకుల కోసం
చూపులు పరితపిస్తుంటాయి
కాలాలు ఎంత గొప్పవో కదా
మనం ఎలా వున్నా
దాని ఉనికిని గుప్పెట్లో వాల్చుతుంది.
ఎంత పోడుబారినా
హత్తుకొనే చలి మంట పైనే
ఎంత ప్రేమ
వరికంకులపై పిచ్చుకలు వాలినట్లు. ..!

- గవిడి శ్రీనివాస్
701927 8368



సవ్వడి

మౌనాన్ని పూనిన మనసుకు
ఆలోచనల పొంగుల్ని ఉప్పొంగిస్తూ
సందిగ్ధతను తరిమేస్తుంది
దారంతా చాచే కాళ్ళకు
ఏ చెట్టు బంధమో బంధించి
చేతులు చాచి పిలిచి
చల్లని గాలుల చరిష్మాని
చక్కలి గింతల సాంగత్యాన్ని అందిస్తాయి

ఒడ్డున నిలిచిన మది దేహాన్ని
అలలు ఆవేశపరచినా
సంద్రం సందేశ సామరస్య గీతాన్ని
వినిపించి మురిపిస్తుంది
పగలంతా ఆకలి పాటతో తిరిగే పక్షి
సాయంత్రం గూటి వైపు చేరుతూ
మధుర స్మృతుల్ని గుప్తంగా దాచి
ధీరత్వాన్ని ప్రదర్శిస్తుంది

మేఘం కూడా సంద్రాన్ని తాకి
ఆకాశ నేస్తం అవుతుంది
ఆశల్ని నింపుకొని
నేలని నవ్వుతూ ముద్దాడుతూ
ముగ్ధ మనోహరంగా మురిసిపోయి
సరికొత్త సవ్వడులు భూమిపై
కొంగొత్తగా సంతరించుకొంటాయి..!

- మహబూబ్ బాషా చిల్లెం
9502000415

మద్దూరి నగేష్ బాబు స్మారక కవితా పురస్కారం

ధిక్కార కవి మద్దూరి నగేష్ బాబు వర్ధంతి సందర్భంగా జనవరి 10న ప్రతి సంవత్సరం కవిత్వానికి పురస్కారాలు ఇవ్వదలిచాము. ప్రధాన పురస్కారానికి 5 వేలు, మరో మూడు ప్రోత్సాహక పురస్కారాలకు వేయి చొప్పున నగదు, జ్ఞాపిక, సత్కారం ఉంటాయి. ఆసక్తి వున్న కవులు 2020 - 22 సంవత్సరాల మధ్య ప్రచురించిన తమ కవితా సంపుటాలను 4 కాపీలు డిసెంబర్ 20లోగా కన్వీనర్, తంగిరాల సోని, డోర్ నెం, 12-45/1, జెడ్పీ హైస్కూలు దగ్గర, కంచికచర్ల, ఎన్టీఆర్ జిల్లా. పిన్ : 521 180. చిరునామాకు పంపాలి. జనవరి 10న విజయవాడలో పురస్కార ప్రదాన సభ ఉంటుంది. వివరాలకు : తంగిరాల సోని, 96766 09234.

విద్యార్థులకు కవితల పోటీ

వివిధ రంగాల్లో కషి చేస్తున్న వసుంధర విజ్ఞాన వికాస సమితి ఈ ఏడాది కూడా పాఠశాల విద్యార్థులకు కర్క ముత్తారెడ్డి స్మారక కవితల పోటీ నిర్వహిస్తోంది. 'అక్షరమే ఊపిరి' అనే అంశం మీద విద్యార్థులు 25 లైన్లకు మించని కవితను పోటీకి పంపాలి. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పదవ తరగతి లోపు విద్యార్థులు మాత్రమే ఈ పోటీలో పాల్గొనాలి. ప్రధానోపాధ్యాయులు ధృవీకరించిన పత్రంతో పాటు కవిత తమ సొంతమనే హామీ పత్రం తప్పనిసరి. ఒకరు ఒక కవిత మాత్రమే పంపాలి. ఐదు ఉత్తమ కవితలను ఎంపిక చేసి సమాన బహుమతులు అందజేస్తాం. కవితలు చేరాల్సిన చివరి తేదీ : డిసెంబర్ 15, 2022. చిరునామా : వి.సుమలత, 8096677409, ఇ.నెం-13-1-3/3/6/2, అవంతినగర్ తోట, మోతినగర్, హైదరాబాద్-500018.

- వి.మధుకర్ రెడ్డి

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

ఈ పురస్కార ప్రదానం గురజాడను గౌరవించడమా?

సందర్భం

"చాందసత్వపు చీకటులు తొలగించి,
లోకపు రీతి మార్చగ
ఆధునిక భావాలదివ్వెల
వెలుగులందించి
అభ్యుదయ పథమందు జాతిని
నడుపగా చేబూని కలమును
ఆయుధముగా ప్రయోగించిన
కవీ, జోహారు"

ఈ రోజు (27/11) గురజాడ కార్యరంగమూ, సాహిత్య క్షేత్రమూ అయిన విజయనగరంలో 'గురజాడ గౌరవయాత్ర' పేరుతో ఆ మహాకవి ఇంటినుంచి గురజాడ విగ్రహం దాకా గురజాడ అభిమానులు కాలినడకన వెళ్ళి గురజాడ వర్ధంతి రోజు (30/11) 'గురజాడ సమాఖ్య' గురజాడ పురస్కారాన్ని చాగంటి వారికి ఇవ్వడం పట్ల తమ అసమ్మతిని తెలియజేసే కార్యక్రమం చేపట్టేరు. (ఇటువంటి యాత్ర జరపాల్సి రావడం దురదృష్టకరం). గత కొద్ది రోజులుగా ఈ విషయంలో ఫేస్‌బుక్‌లోనూ, వాట్సాప్ గ్రూపుల్లోనూ చర్చలూ, వాదనలూ జరుగుతున్నాయి. ఖండన మండనలు సాగుతున్నాయి. వ్యవహారిక భాషోద్యమ కాలంలో గురజాడ అసమ్మతి పత్రం ప్రకటించేడు. వందేళ్ళు దాటేక ఇప్పుడు గురజాడ కోసం గురజాడ సాహిత్యాభిమానులు ప్రకటిస్తున్నారు అసమ్మతి పత్రం.

ఒక మహనీయుని పేరుతో పురస్కారం ప్రకటించాలంటే ఆ మహనీయుని భావజాలానికి అనుగుణ్యమైన వారినే ఎంపిక చేయడం సమంజసం. ఒక మహోన్నతమైన వ్యక్తి పేరుతో పురస్కారం ఏర్పాటు చేయడమెందుకంటే వారి ఆశయాల్ని కొనసాగించడానికీ, వాటిని ప్రజల్లో వ్యాపింపజేయడానికీ. కానీ గురజాడ భావజాలానికీ, ఆలోచనలకీ వారి సంస్కరణ భావాలకూ వ్యతిరేకమైనవారిని, ఎంపిక చేయడం గురజాడ అభిమానులను సహజంగానే బాధ కలిగించింది. గతంలోనూ ఇలా ఎంపిక చేయడాన్ని వ్యతిరేకిస్తూ పత్రికా ముఖంగా తమ అసమ్మతిని తెలియజేస్తూ వచ్చేరు. ఇప్పుడూ అదే చేస్తున్నారు. ఐనా పురస్కార ప్రదాతలు తమ చర్యల్ని సమర్థించుకోడానికి వ్యర్థ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

వారి సమర్థింపుల కోసం గురజాడ దైవ భక్తుడనీ, సంప్రదాయ వాదనీ చెప్పుకొచ్చేరు. అందుకు ఆధారం కన్యాశుల్కంలోని చివరి అంకంలో సౌజన్యారావు పంతులు చేతిలోని భగవద్గీత. గురజాడ ఇంట తులసికోట. తులసికోట వుంటేనో, దేవుడి పటం ఉంటేనో ఆ వ్యక్తి ఆస్తికుడని , భక్తుడని నిర్ణయం చేసేడమేనా? కథలోనో, నాటకంలోనో, నవలలోనో సృజనకారుడు ఎన్నో పాత్రల్ని సృష్టిస్తాడు. ఆ పాత్రల అభిప్రాయాలు రచయిత అభిప్రాయాలుగా భావించడం సరైందేనా? ఒక పాత్ర హంతకుడైతే రచయితని హంతకుడని నిర్ధారణ చేసేస్తారా? .. ఆయా పాత్రల సామాజిక స్థాయిననుసరించి సంభాషణల ద్వారా తాను నమ్మిన సత్యాన్ని ఆవిష్కరిస్తాడు. అంతవరకే. కన్యాశుల్కం నాటకంలో 'గిరీశం గురజాడే' అన్నవాళ్ళున్నారు. 'గురజాడే సౌజన్యారావు పంతుల'న్నవాళ్ళూ ఉన్నారు. ఇలా ఎవరికి తోచినట్టు వారు నిర్ణయాలు చేస్సేరు. 'మధుర వాణి' ఆడవేషం వేసుకున్న గురజాడే అని అనీలేదు, రక్షించేరు!

గురజాడ జీవించినన్నాళ్ళూ ఛాందసుల విమర్శల్ని ఎదుర్కొంటూనే వచ్చేడు. గ్రాంధిక వాదుల అవహేళనల్ని, వెటకారాల్ని, వారి వికారాల్ని సహిస్తూనే తన ఉద్యమాన్ని కొనసాగించి విజయగర్వంతో తలెత్తి నిలబడ్డాడు. తాను భౌతికంగా లేనప్పుడూ వదల్లేదాయనను కొందరు. 'గురజాడ మరణించాకే జీవించడం ప్రారంభించేర'ని కృష్ణశాస్త్రి గారంటే ... అలా గురజాడ జీవించడం ఇష్టం లేని, అతని భావజాలంతో ఏకీభవించలేని కొందరు తమ పాండిత్యమంతా రంగరించి కుస్తీలు పట్టి జబ్బసత్తువకొద్దీ సంగతి వ్యాసాలు లోకమ్మీదకొదిలిన సంగతి ఇప్పటి గురజాడ సాంస్కృతిక సమాఖ్య వారికి తెలీదా? ఆ వ్యాసాలకు ధీటుగా సమాధానం చెప్పే ప్రయత్నం చేసేరా ఎవరైనా? అయినా అతడు గురజాడ. ఆ గురుజాడ ఎవరూ చెరపలేనిది.

గురజాడ ఆస్తికుడని చెప్తున్న వారు ఈ గురజాడ మాటల్ని చదివితే ఏమంటారో! "అందరు దేవుళ్ళూ వక్కరే అయితే ఆ పీనుగుల్ని అందరినీ ఒక్కచోటే నిలిపి అందరూ కలిసి పూజ తగలెట్టరాదా?" (దేవుళ్ళారా మీ పేరేమిటి?)

"కార్యకారణ సంబంధ జ్ఞానం శూన్యమైనప్పుడు ఏది జరిగినా అది కాకతాళీయం, వేళావిశేషం, విధికృతం, యాదృచ్ఛికం అని వ్యక్తులు ఊహించి సంతృప్తి పడతారు. ఆలోచనకు చోటివ్వరు."

"అంధవిశ్వాసాలు ప్రమాదకరమైనవి. ప్రశ్నించే స్వభావం లేనప్పుడు గుడ్డి నమ్మకాలు కలుగుతుంటాయి. మనల్ని ఛాందసత్వం ప్రశ్నించనీయదు"

"క్షుద్రదేవతారాధన, ఉపాసన అనే మూఢ విశ్వాసాలను కలిగించి కొందరు దొంగ వేదాంతులు చేసే ఘోర కృత్యాలకు లెక్క లేదు. 'వేదాంతులొస్తున్నారు, చెంబులూ ముంతలూ జాగ్రత్త' అన్న సామెత ఊరికే పుట్టలేదు."

(గురజాడ 'తనలో తాను' శీర్షిక నుండి)

"చంద్రవంశపు పట్టమహిషలను పుండాకోరులైన బ్రాహ్మణులకు బాహాటంగానే తార్చినట్లు కనిపిస్తుంది. బాహాటంగా జరిగినవే ఇలా వుంటున్నప్పుడు ఇంక రహస్యంగా ఎన్ని దుర్మార్గాలు, అవినీతి చర్యలు, దోషాలు జరిగాయో కదా? మీ ఇతిహాసాలను, పురాణాలను వొక్కసారి చదివి చూద్దూ."

(మునిసుబ్రహ్మణ్యం గారికి 21.5.1909న ఉదకమండలం నుంచి గురజాడ రాసిన ఉత్తరం నుండి)

"వివాహసంస్థ పురోగతికి దోహదం చేసిన మాట నిజమే, ఐతే వివాహబంధాన్ని తెంచుకోరాదనే నియమం చెప్పనలవిగాని కన్నీటి గాథలకు కారణం. ఈ సత్యాన్ని మనమెవరమూ విస్మరించలేము."

"మగవాళ్ళ అధికారం కింద, పెత్తనం కింద బానిసలుగా ఆడవాళ్ళు ఎలా పడివున్నారో, ఎంత మగ్గిపోతున్నారో నేనూహించుకోగలను."

(మునిసుబ్రహ్మణ్యం గారికి ఉదకమండలం నుండి 2.6.1909 న రాసిన ఉత్తరం నుంచి)

పైన ఉదహరించిన వాక్యాలు చదివాక కూడా గురజాడ ఆస్తికుడనే అంటారా?

"పుస్తకంబులలోని మాటలు
విస్తరించుచు ననుభవమ్ముల
తత్వమెరుగక శుకములగుదురు
వొట్టి శాస్త్రజ్ఞుల్.."

"వెర్రి పురాణగాథలు నమ్మజెల్లనె పండితుల్" అని గాలిపోగేసే మాటల్ని నమ్మొద్దంటున్నాడు గురజాడ. గురజాడను అభిమానించేవారయితే, అనుసరించే వారయితే తప్పకుండా ఆలోచించేవారు. గతంలో పురస్కారాలు పొందే వారి జాబితాలో చాలా పేర్లు ఉండే అవకాశమే లేదు. ఇప్పుడీ అసమ్మతి పత్రమూ, గౌరవయాత్రా అవసరమయ్యేదే కాదు!

చాగంటి కోటేశ్వరరావు గారు పండితులు, పురాణాల్ని ఆపోసన పట్టినవారు. గొప్ప ధారణాశక్తి గలవారు. ఆ శక్తి ఎవరికి ఉపయోగమనుకుంటే వారు స్వీకరిస్తారు. అతని ప్రతిభకు తగ్గట్టు, ఆ భావజాలానికి అనుగుణ్యమైన అపూర్వమైన గొప్ప పురస్కారం ఇచ్చి, గౌరవిస్తే ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండేదికాదు గదా.. సంతోషించేవారు కూడా. 'గురజాడ' పురస్కారం అన్నారు గనకనే ఇదంతా.

'ఆధునిక కవితా వధూటికి
అందచందములద్ది, వన్నెలు
దిద్ది ముత్యాల్ సరములమరగ
జేసి వాడుక భాషలో
ప్రజల మాటను ప్రాణసమముగ
నెంచి, మూఢత్వమును దృంచగ
జనం కోసము ఉద్యమించిన
కవీ జోహారు..''


- గంటేడ గౌరునాయుడు
ప్రముఖ రచయిత, కవి

మహాకవీ .. కాస్త గుర్తు చేయండి ...

సందర్భం

వర్తమానంలో గురజాడను ఓ 'ప్రచారకర్త'గా భావిస్తున్నారు. హేతువాదాన్ని, భాషా స్వరూపాలను, మానవజాతికి ఉండవలసిన ఆకాంక్షల ఉదాత్త రూపాన్ని అక్షరబద్ధం చేసిన గురజాడను సహితం సంప్రదాయ ఛాందసవాద ప్రచారం కోసం వాడుకొంటున్న 'గురజాడ' వర్గీయులను గురజాడ 'గద్దించవలసిన' అవసరం ఉందనిపిస్తున్నది. "మహాకవులెవరైనా వారు జీవించిన కాలంలో సమాజంలో అనివార్యమైన అసంతృప్తి ఉంటుంది. అసమ్మతి ఉంటుంది. దానిని వారు తమ రాతలతో పట్టుకోజూస్తారు. రూపం కట్ట జూస్తారు. జనం మనసును ఆకట్టుకోజూస్తారు. వారి మస్తిష్కాలను పట్టజూస్తారు. ఆ అసంతృప్తి, సాహిత్యరూపంలో దాని ఆవిష్కరణ విశ్వమానవుడిని చూపించే క్రమానికి ఒక వెలుతురు ఇస్తుంది!" అనే వివినమూర్తిగా వ్యాఖ్యానం వెనుక గురజాడ వారి 'చూపు' అర్థమవుతుంది. హేతువాదపు దృక్పథాన్ని వ్యవహారిక భాషా పోరాటంతో సమ్మేళన పరచి నాటి (నేటి) సమాజపు తీరు తెన్నులను అక్షరాలకు ఆవేదనద్ది తెలుగు వారికి అందించిన వైనం నేడు ఎంతోమంది 'విస్మరిస్తున్నా'రనేది వాస్తవం. ఆయన నాటి సమాజ 'సమూహాలలో' కొన్ని సంప్రదాయాలు, మతం పేరిట ఆచరమైన దురాచారాల పట్ల తన స్వంత వివేచనతో, ధైర్యంతో ధ్వజమెత్తాడు. ఇవి నేడు లేవని.. ఆయన అడుగుజాడలో నడుస్తున్నామని గట్టిగా విశ్వసించ గలవారేరి? వర్ణవ్యవస్థకు, కుల వ్యవస్థతకు గొప్ప ఆశావహ దృక్పథంతో 'యెల్లలోకములు వొక్కయిల్లై/ వర్ణ భేదములెల్ల కల్లై' అని నినది స్తూనే 'మతములన్ని మాసిపోవును/ జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును' అని ఘనమైన ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించారు. కానీ, ఆ వాతావరణం నేడు నెలకొని ఉందా అనేది సమాధానం దొరకని ప్రశ్న.

గురజాడ వారిని విశ్లేషించుకొనే సమయంలో సమాజంలో మార్పులకు సాహిత్యం ఓ వారధి. సాహిత్యంలో కూడా మార్పులకు పామర భాష వలన సాధ్యం. వ్యవహారిక భాషలో ఆయన సృజియించిన రచనలలో ఈ అంశాలు కనిపిస్తాయి. సమాజం, సాహిత్యం, రచయితలలో సహితం నిబద్ధత, సాటి మనుషులపట్ల సౌహార్ద్రపూరిత సానుభూతి కూడా అవసరమంటాయి ఆయన రచనలు. మరి నేటి రచయితలు, సాహిత్యం వీటి మధ్య సన్నగా నిలిచిన సమాజం ఆ త్రోవలో ప్రయాణిస్తున్నాయా? ఆలోచించవలసిన అవసరం 'గురజాడ'ను స్మరించుకొనే ప్రతి సందర్భంలోనూ ఉందనేది కాదనలేని సత్యం.



సాహితీ లోకంలో 'గురజాడ'ను ఆధునిక, అభ్యుదయ పదాలకు పర్యాయ పదంగా ప్రశంసించటం ఎరిగిన సత్యం. కాని క్రమేణా ఈ రెండు పదాలకు 'అతి'వాదులు విపరీతార్థాలలో నిర్వచనాలు లిఖించుకుని 'గురజాడ' రచనలకు కొత్త భాష్యాలు రాస్తూ... అలా ప్రవచించిన ప్రచారకర్తలకు 'ఆయన పేరు మీదనే' పురస్కారాలందిస్తున్నారు. ఇది తిరోగమనమా? పురోగమనమా? అనేది గుర్తు చేసుకోవలసిన తరుణమిది. గురజాడ 'సత్య' అన్వేషి. 'వ్యక్తి' లేదా 'ఆదర్శ' ఆరాధకుడు కాదు. 'అడుగుజాడ- గురజాడ' అనేవారు ఈ విభజన క్రమంలో ఏ వాదానికి బద్ధులో కూడా గుర్తించుకోవలసినది ఉంది.. 'చెట్టపట్టాల్ పట్టుకొని/ దేశస్థులంతా నడువవలెనోయ్/ అన్నదమ్ముల వలెను జాతులు/ మతము లన్నియు మెలగవలెనోయ్' అనే గురజాడ 'దేశభక్తి'లో వివిధాంశాలకు విభిన్నమైన విశ్లేషణలు చేస్తూ 'వ్యక్తిగత అజెండాలతో 'దేశ' భక్తి ముసుగులో ఎవరికి వారే మతం, జాతి, కులం ట్రంప్ కార్డుల సహాయంగా నాయకులుగా ఎదుగుతున్న నేటికాలంలో 'గురజాడ... నీ తత్వం కాస్త గుర్తు చేయవయ్య' అని ఆవేదన చెందడంలో అర్థముందనే అనుకోవచ్చు. 'వట్టి మాటలతో' గారడీలు చేసి పదవులందుకొని 'గట్టిమేలు' తనవారికి చేసుకొంటున్న నాయకులున్న నేటి సమాజంలో గురజాడ జయంతులు, వర్ధంతులు నిర్వహించుకొనే సమయంలో ఆయన నిజాయితీగా, సందేశాత్మకంగా రాసిన 'దేశభక్తి'గీతం ద్వారా వర్తమాన తరానికి అందుతున్న సందేశమేమిటి? "యీసురోమని మనుషులుంటే' దేశమెలా బాగుపడుతుందనే రాజనీతి నీడలో కోట్లాది పేదల ఆకలి తీర్చే పనులు కన్నా కోట్లు వెచ్చించి విగ్రహాలు ఏర్పాటు వెనుక 'గురజాడ' అడుగుజాడలను విస్మరిస్తున్న విధానం విషాదం కాదా! దేవుడు చేసిన మనుషుల్లారా! మనుషులు చేసిన దేవుళ్ళారా మీ పేరేమిటని ప్రశ్నించిన 'గురజాడ'ను ఆ దృక్కోణం నుంచి సమాజానికి ఓ విభిన్నమైన పంథాను నేటి తరానికి అందించే దిశగా కృషి చేయవలసిన అవసరం ఉంది. గురజాడ సాహిత్యంలోని హేతువాదం, భాషావాదం, ఆశావాదం, మానవతావాదం, మనిషివాదం భావితరాలకు అందించాల్సిన తరుణం వచ్చింది.

దేశమనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూలెత్తవలెనోయి
నరుల చమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయి!

తెలుగు భాషను క్రమేపి కనుమరుగు చేస్తున్న నేటి ప్రభుత్వాలకు తెలుగు భాషామాధుర్యం. చరిత్రలను 'మహాకవి గురజాడా... కాస్త గుర్తు చేయండి!'.

- భమిడిపాటి గౌరీశంకర్
9492858395

మత్స్యకారుల జీవన్మరణ పోరాటం

పుస్తకం

సిక్కోలు జాలర్లు నీళ్లల్లో ఈదగలిగారు గానీ, కన్నీళ్లలో ఈదలేకపోయారు.. చేపలు పట్టి, గుజరాత్ సేట్ల ఎదాన కొట్టినా వాళ్ల బతుకు బాగుపడటం లేదు.. మహాసాగరంలో మునగానాం తేలానాంగా నిత్యం వ్యథాభరితమై సాగిపోతోంది వారి జీవితం.. ఈ వేదన నుంచీ, ఈ దు:ఖం నుంచీ ఉబికి వచ్చిందే చింతకింది శ్రీనివాసరావు నవల 'మున్నీటిగీతలు'.

ప్రతి మనిషికీ ఉన్న రెండు కళ్లూ రెండు సముద్రాలే కదా! వాటినుంచి బయల్పడేవీ ఉప్పని వెచ్చని జలాలే కదా! భూమ్మీద గీతలు గీసి, దేశాలుగా కోసి, రాష్ట్రాలుగా చేసి, జిల్లాలుగా దూసి విభజించడానికేనా మేధస్సు ఉన్నది? ఇప్పటికే మానవుడు ఆడ, మగ అని గీశాడు. ధనిక, పేద అని గీశాడు. కులాలు, మతాలు అని గీశాడు. అసలు మనిషి ఉన్నది గీతలు గియ్యడానికా? గీతలు చెరపడానికా? అందరి ఆకలీ ఒక్కటే అయినప్పుడు, అందరి నవ్వూ ఒకటే అయినప్పుడు, అందర్నీ కన్నప్పుడు తల్లుల నొప్పుల తీరు సమానమే అవుతున్నప్పుడు ఈ గీతలేంటి? ఈ గిరిగీసుకోవడం ఏంటి? విశ్వమానవునిగా ఎదిగిన 'మున్నీటి గీతలు' నవల మన ముందుకు తెచ్చే అంశాలివే. ఆలోచింపజేసే విషయాలివే. ధనబంధం లేని మానవతా సంబంధాలు ఏర్పడాలని, దేశానికి మించిన దేహసముదాయాలు నెలకొనాలని నొక్కి చెప్పే కథాకథనమిదే.

చేపల వేట కోసం సముద్ర జలాలు దాటేసి, సరిహద్దులు తెలియని స్థితిలో పరాయి దేశాల నావికా దళానికి చిక్కిపోయి, ఏళ్ల తరబడి విదేశీ కారాగారాల్లో మగ్గిపోతున్న పేద మత్స్యకారుల గతుకుల బతుకుల్ని కళ్లకు కడుతుంది ఈ నవల. గంగపుత్రుల భద్రత లేని జీవితాలను యధాతథంగా తెలియజేస్తుంది. తెలుగు సాహిత్యంలో ఇంతవరకూ ఎన్నడూ చూడ(లే)ని బెస్తల ఇతివృత్తంతో బాధ్యతలా సాగిపోతుంది. పటిష్టమైన నిర్మాణం, అద్భుతమైన పలుకుబడి, అసమాన శైలీవిలాసం ఈ రచనకు ఆస్తిపాస్తులు. చింతకింది శ్రీనివాసరావు దీనిని చేపట్టిన, నిర్వహించిన తీరు తిరుగులేనిది.

మత్స్యకారుల మనుగడలోని ఆనందాలు, విషాదాలు, ఆకలి, పోరాటం, ఇక్కట్లు, ఇబ్బందులు తదితరాలన్నింటినీ మున్నీటి గీతలు పట్టి చూపుతుంది. శ్రీకాకుళం జిల్లా తీరప్రాంతంలోనూ, ఆ మాటకొస్తే కళింగాంధ్రలోనూ మత్స్యకారుల జనాభాకు సరిపడినన్ని ఫిషింగ్ హార్బర్లు లేవు. చేపల వేటకు అవసరమైన జెట్టీలు లేవు. పొడవైన తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నదని గర్వపడాలో, తీరంలో జాలర్లకు కనీస సదుపాయాలే లేవని బాధపడాలో అర్థం కాదు. భావనపాడు పోర్టు నిర్మాణం ఇప్పటికీ కాగితాల మీదనే కనిపిస్తోంది. ఇలాంటి స్థితిలో ఆకలికి తాళలేని సిక్కోలు మత్స్యకారులు వలస పోవలసి వస్తోంది. గుజరాత్ తీరానికి వెళ్లి, ఆక్కడి బడా సేట్ల కంపెనీల కోసం చేపల్ని పట్టవలసి వస్తోంది. సేట్లు ఇచ్చే జీపీఎస్‌లు పనిచేయక, పడవలు సరిగ్గా నడవక, వారు సముద్రంలో తరచూ గల్లంతవుతున్నారు. పాకిస్థాన్ బోర్డర్‌ను తెలియజేసే నీటి మీద గీతల్ని గుర్తుపట్టలేక ఆ దేశపు జవాన్లకు అందిపోతున్నారు. ఆ తర్వాత వాళ్ల ఆయుష్షు దైవాధీనం. ఈ సంగతులన్నింటినీ అచ్చమైన కళింగాంధ్ర యాసభాషల్లో తీర్చిదిద్దారు రచయిత చింతకింది. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస రైల్వేస్టేషన్ నుంచి మత్స్యవేనం గ్రామ జాలర్ల జట్టు గుజరాత్‌లోని వెరావల్ ఫిషింగ్ జెట్టీకి వెళ్లడం మొదలాడి, పడమర సముద్రంలో గీతలు దాటిపోయి, కరాచీ జైలుకు చేరిపోయి, విడుదలై స్వగ్రామానికి తిరిగివచ్చేవరకూ వివరిస్తుంది ఈ నవల. రచయిత అక్షరశక్తి అడుగడుగునా ముద్ర వేసుకుంటూ ఆసక్తిగా చదివించుకుంటూ వెళుతుంది. సామెతలు, నానుళ్ళు, దేశీయ పదబంధాలు, మాండలిక సౌరభాలతో మెరిసిపోతుంది. పోటెత్తిన సముద్రం, నీరుతీసిన సాగరం, కుదుపుల వేట, విసిరిన వలలు, ఎడగాలి, సుడిగాలి, వాన, వరద, చేపలరకాలు, పడవ ఎదుర్కొనే ఒడిదుడుకులు, తాండేలు (బోటు డ్రయివర్) విన్యాసాలు, కళాసీల (మత్స్యకార్మికులు) శ్రమదమాదులు ఆవిష్కరిస్తుంది.



పారిశ్రామిక వ్యర్థజలాలను సముద్రంలోకి పంపేసి.. తగరం, జింక్ కడుగుడు నీళ్ళను, వివిధ లోహశుద్ధీకరణ వ్యర్థాలనూ సాగరంలోకి తరలించి.. మత్స్యజాతిని పెట్టుబడిదారులు ఎలా అంతమొందిస్తున్నారో, ఫలితంగా నిరుపేద గంగపుత్రులు ఎలా సర్వనాశనం అయిపోతున్నారో 'మున్నీటిగీతలు' తెలియజేస్తుంది.

కథలో నాయికానాయకులైన పోలారావు, ఎర్రమ్మల నడుమ అంకురించిన ప్రేమ, ఉదాత్తమైన వారి నడత, సముద్రాన్నే సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. నీళ్లే నీళ్లాడినట్టు చేస్తుంది. జలారణ్యంలో నిర్భీతిగా, సరికొత్త అనుభవంతో పాఠకులు పరిభ్రమించేలా చేస్తుంది.

పది కాలాల పాటు సాహిత్యంలో నిలిచిపోయే రచన చేయాలంటే ఎంతటి పట్టుదల, మరెంతటి పరిశోధన, ఇంకెంతటి పరిశీలన అవసరమో భావితరం రచయితలకు స్పష్టం చేయగలదీ నవల. రచయితకు పదసంపదతో పాటు తాదాత్మ్యం చెందే హృదయం, అద్వైతదృష్టి, క్షేత్ర దర్శనశక్తి పుష్కలంగా ఉంటేగానీ ఇలాంటి రచనలు చేయలేరు. ఆ లక్షణాలన్నీ సమృద్ధిగా ఉండబట్టే ఇంతటి మహత్తర నవల చింతకింది శ్రీనివాసరావు రాయగలిగారు. బెస్తల్లో బెస్తగా ఒకానొక పరకాయ ప్రవేశమేదో రచయిత విజయవంతంగా చేసినట్టు చెప్పుకోవచ్చు. మత్స్యకార గ్రామాల్లో తిరిగి, వాళ్లతో మమేకమై, వాళ్ల జీవన విధానాన్ని ఆకళింపు చేసుకోవడం వల్లనే ఈ రచనను ఆయన ఇంత ఘనంగా నడిపించగలిగారనేది నిస్సందేహం.

'మున్నీటిగీతలు' తెలుగు మత్స్యకారుల కఠినమైన జీవన దృశ్యాలను పదుగురికీ విస్పష్టం చేయగల గొప్ప నవల. ఇది జాలర్ల బతుకుల మీద ప్రసరించిన సూర్యకిరణ జాలం. మానవతా పరిమళాలను వెదజల్లే నవ్యవేదం. ఒకరకంగా ఇదొక ఆధునిక మత్స్యపురాణం. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 2021 సంవత్సరపు ప్రతిష్టాత్మక నవలా పోటీల్లో బహుమతి పొందిన ఈ 'మున్నీటిగీతలు' అందరూ చదవాల్సింది. సంబరపడవలసింది. ఉత్సుకత, ఉద్వేగాల నడుమ తేలిపోవలసింది. రచయిత చింతకింది శ్రీనివాసరావుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేయవలసింది.

- ఆకుల మల్లేశ్వరరావు
79818 72655

4న కవిత స్మారక జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదాన సభ

డిసెంబరు 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోం భవన్‌లో కవిత స్మారక జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదాన సభ జరుగుతుంది. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ అధ్యక్షులు వాసిరెడ్డి పద్మ హాజరవుతారు. సాహితీవేత్తలు కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్, బంగార్రాజు కంఠ, డా.తూములూరి రాజేంద్రప్రసాద్, డా.యం.బి.డి.శ్యామల ఈ సభలో పాల్గొంటారు. కందుకూరి నవలా పురస్కారాన్ని ఎం.అరుణకుమారి (చిత్తూరు), గురజాడ కథా పురస్కారాన్ని భండారు విజయ (హైదరాబాద్), శ్రీశ్రీ కవితా పురస్కారాన్ని పద్మావతి రాంభక్త (విశాఖపట్నం), జానమద్ది సాహిత్య పురస్కారాన్ని కిన్నెర శ్రీదేవి (కుప్పం), డా.రావూరి భరద్వాజ బాల సాహిత్య పురస్కారాన్ని సమ్మెట ఉమాదేవి (సికింద్రాబాద్) ఈ సభలో అందుకోనున్నారు.

- అలపర్తి పిచ్చయ్య చౌదరి, బోయపాటి దుర్గాకుమారి,
కవిత విద్యాసాంస్కృతిక సేవాసంస్థ

యాకూబ్‌కు ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం

ప్రముఖ కవి విమర్శకులు డా.యాకూబ్ ... ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కారం 2022కు ఎంపికైనట్లు అధ్యక్షులు ఎదిరెపల్లి కాశన్న తెలిపారు. 2022 డిసెంబర్ 18న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగే సభలో రూ.20 వేల నగదుతో పాటు శాలువా, మెమెంటోతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరవుతారని తెలిపారు.

డిసెంబర్ 11న కుందుర్తి శత జయంతి సదస్సు

సాహిత్య అకాడెమి, కవి సంధ్య సంయుక్త నిర్వహణలో డిసెంబర్ 11 ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రోజంతా హైదరాబాద్, రవీంద్ర భారతి సమావేశ మందిరంలో వచన కవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులు శతజయంతి సాహిత్య సదస్సు జరుగుతుంది. ప్రారంభ సదస్సులో కె.శివారెడ్డి, కె.శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, శిఖామణి, కుందుర్తి కవిత పాల్గొంటారు. తర్వాత జరిగే సదస్సుల్లో శీలా సుభద్రాదేవి, సుధామ, సీతారాం, నాళేశ్వరం శంకరం, ఎన్.వేణుగోపాల్, యాకూబ్, పుప్పాల శ్రీరాం పత్ర సమర్పణ చేస్తారు.

సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు సమావేశంలో నగ్నముని, విహారి, చల్లా రామఫణి పాల్గొంటారు. ఈ సందర్భంగా కవి సంధ్య 39, కుందుర్తి శత జయంతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ ఉంటుంది.

- కె.శ్రీనివాసరావు, కార్యదర్శి
సాహిత్య అకాడమి.



కూలిన రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి

●13 మందికి గాయాలు

బల్లార్షా: మహారాష్ట్ర చంద్రాపూర్‌లోని బల్లార్షా రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ వంతెన కొంత భాగం కూలిపోయింది. ఈ ఘటనలో 13మందికి పైగా గాయాలు కాగా, నలుగురికి తీవ్రగాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్‌ఫాం నుంచి వేరే ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఈ వంతెనపై నడుస్తుండగా అనేకమంది ప్రయాణికులు దాదాపు 20అడుగుల ఎత్తు నుంచి ట్రాక్‌పై జారిపడ్డారు. ఈ ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పుణె రైలు ఎక్కేందుకు ఒక్కసారిగా ప్రయాణికులు ఫుట్‌ఓవర్ వంతెనను ఉపయోగించడంతో అకస్మాత్తుగా అది కిందకు వంగిపోయిందని అధికారులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని 1 నంబర్ ప్లాట్‌ఫాం నుంచి 4వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్తున్న సమయంలో చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అందుబాటులో ఉన్న వాహనాల్లో ప్రయాణికులు, ఐఆర్‌సిటిసి సిబ్బంది హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. చంద్రాపూర్‌కు 12 కి.మీల దూరంలోని బల్లార్షా జంక్షన్ రైల్వేస్టేషన్‌లో ఈ సాయంత్రం 5గంటలకు ప్రమాదం చోటుచేసుకుందని రైల్వే అధికారులు తెలిపారు. పెద్ద ఎత్తున ప్రయాణికులు పూణె వెళ్లే రైలు ఎక్కేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించడంతో కొంత భాగం కిందకు వంగిపోయినట్లు తెలిపారు. మిగతా వంతెనంతా చెక్కు చెదరలేదన్నారు. దీని పైనుంచి 20అడుగుల ఎత్తు నుంచి రైల్వేట్రాక్‌పై కొందరు జారిపడిపోయారని వివరించారు. 13మందికి గాయాలు కాగా.. వారిని బల్లార్‌పూర్ రూరల్ ఆస్పత్రికి తరలించామన్నారు. వీరిలో కొందరిని చంద్రాపూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించినట్టు అధికారులు వెల్లడించారు. జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారని చంద్రాపూర్ జిల్లా కలెక్టర్ వినయ్ గౌడ వివరించారు. క్షతగాత్రులకు అవసరమైన వైద్యం సహాయం అందించాలని చంద్రాపూర్ గార్డియన్ మంత్రి సుధీర్ మునంటివార్ వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్టు అధికారులు తెలిపారు.

దేశం ప్రమాదంలో పడింది

- సమైక్యత కోసం పోరాటం తప్పదు
- టెకీస్ ఫర్ ఎ బెటర్ ఇండియా కార్యక్రమంలో సీతారాం ఏచూరి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశం ప్రమాదంలో పడిందని, కేంద్ర ప్రభుత్వం సావర్కర్ ప్రతిపాదించిన హిందూ రాష్ట్ర భావనను శరవేగంగా అమలు చేస్తోందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. రాజ్యాంగానికి మూల స్తంభాలుగా ఉన్న లౌకికవాద ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, సమాఖ్య భావనలు ప్రమాదంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెకీస్ ఫర్ బెటర్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ది ఐడియా ఆఫ్ ఇండియా అనే అంశంపై ఆదివారం ఆయన ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటానికి కొనసాగింపుగా సోషలిజం, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయాల్సి ఉందన్నారు.

రాజ్యాంగాన్ని కాదనీ, ప్రత్యేక వివాహ చట్టంపై వివాదం రేపారని పేర్కొన్నారు. లవ్ జిహాద్ పేరుతో భిన్న విశ్వాసాలు అనుసరించే వారి మధ్య వివాహాలను నిషేధిస్తూ చట్టాలను చేస్తున్నారని తెలిపారు. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ప్రతి దాన్ని ప్రయివేటీకరిస్తూ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో రాజకీయ అవినీతికి తెరలేపారని తెలిపారు. దళితులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. గిరిజన హక్కులను హరించేలా వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని తెలిపారు. కేంద్ర-రాష్ట్రాల మధ్య సంబంధాలకు సంబంధించి రాజ్యాంగం ఇచ్చిన సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా బిజెపియేతర రాష్ట్రాల్లో గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాల పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారు. కేరళ, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో గవర్నర్ల తీరు ఆక్షేపణీయంగా ఉంది. గవర్నర్లంటే రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాదారులుగా ఉండాలని ఏచూరి ఈ సందర్భంగా సూచించారు. రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా పని చేయాల్సిన సంస్థలు నిర్వీర్యమైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘంపైనే యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించకపోతే ఇక ప్రజాస్వామ్యమెక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఇడి, సిబిఐల పరిస్థితి చెప్పనక్కర్లేదన్నారు. సమానత్వమంటే కేవలం భౌతిక సమానత్వమే కాదని, మేధోపరమైన సమానత్వం కూడా ఉండాలని అభిప్రాయపడ్డారు. అందరికీ విద్య, ఉద్యోగ అవకాశమని తెలిపారు. భవిష్యత్ ఇండియా యువత చేతుల్లోనే ఉందని, భారతదేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయవాదం, మతం వేర్వేరని తెలిపారు. ఆకలి, నిరుద్యోగం కన్నా తమకు మతమే సుప్రీం అంటూ యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, అసలు మనిషే జీవించి ఉండకపోతే మతంతో పనేముంటుందని ప్రశ్నించారు.

గుజరాత్ ఎన్నికల్లో 139 మంది మహిళా అభ్యర్థులు

- బిజెపి నుంచి 18, కాంగ్రెస్ నుంచి 14 మందికి అవకాశం

న్యూఢిల్లీ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన బిజెపి, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు మహిళా అభ్యర్థులకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదు. మొత్తం 182 స్థానాల్లో.. బిజెపి -18, కాంగ్రెస్-14, ఆప్-9, బిఎస్‌పి -13, ఎఐఎంఐఎం-2 స్థానాల్లో మహిళలకు టికెట్లు ఇచ్చాయి. గుజరాత్ ఎన్నికల ఓటర్లలో మహిళలు సగం మంది ఉన్నారు. వారి ప్రాతినిధ్యానికి తగ్గట్టుగా ప్రధాన రాజకీయ పార్టీలేవీ మహిళా అభ్యర్థులకు అవకాశం ఇవ్వలేదని విమర్శలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 139 మంది మహిళా అభ్యర్థులు ఆయా నియోజికవర్గాల్లో పోటీలో నిలబడ్డారు.

ఇందులో 56 మంది మహిళలు స్వతంత్ర అభ్యర్థులు. గత అసెంబ్లీ ఎన్నికల్లో (2017) 126 మంది మహిళా అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో బిజెపి నుంచి 12మంది, కాంగ్రెస్ నుంచి 10మంది మహిళలకు టికెట్లు దక్కాయి. డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దఫాలుగా పోలింగ్ జరగనున్నది.

హర్యానా స్థానిక ఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బ

పంచకులలో పది స్థానాల్లోనూ ఓటమి ● బిజెపి ఎంపి నయాబ్ సింగ్ సైనీ భార్య పరాజయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హర్యానా జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో అధికార బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. పంచకులలోని మొత్తం పది స్థానాల్లోనూ ఓటమి పాలైంది. బిజెపికి చెందిన కురుక్షేత్ర ఎంపి నయాబ్ సింగ్ సైనీ భార్య సుమన్ సైనీ సైతం ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ పార్టీ తన గుర్తుతో ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. దీంతో, ఆ పార్టీకి చెందిన వారు స్వతంత్రులుగానే బరిలో దిగారు. కాంగ్రెస్ మద్దతుదారులుసహా స్వతంత్రుల హవా కొనసాగింది. హర్యానాలో ఈ నెల 22 నుంచి 25 వరకు 143 పంచాయతీ సమితులు, 22 జిల్లా పరిషత్‌లకు మూడు దశల్లో ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలు ఆదివారం వెలువడ్డాయి. ఉత్తర హర్యానా జిల్లాలు అంబాలా, కురుక్షేత్ర, యమునా నగర్ జిల్లా పరిషత్‌లలో కాంగ్రెస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులు, ఆప్ అభ్యర్థుల నుంచి అధికార బిజెపి, జెజెపి పార్టీలు పెద్ద షాక్‌ను ఎదుర్కొన్నాయి.

బిజెపి ఎంపి నయాబ్ సింగ్ సైనీ భార్య సుమన్ సాయిని అమాబాలా డివిజన్ నాలుగో నెంబరు వార్డు నుంచి పోటీ చేసి, ఓడిపోయారు. సుమన్ సైనీపై కాంగ్రెస్ మద్దతు గల స్వతంత్ర అభ్యర్థి రాజేష్ దేవి 236 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సిర్సాలో ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్‌డి) నేత, ఎమ్మెల్యే అభయ్ చౌతాలా తనయుడు కరణ్ చౌతాలా 625 ఓట్ల తేడాతో జిల్లా పరిషత్‌ను గెలుచుకున్నారు. కర్నాల్‌లో కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎన్ఎస్ఎస్ వైసిపి జిల్లా అధ్యక్షుడు శివకుమార్ 1,534 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పానిపట్‌లో జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆశు షేరా ఓడిపోయారు. ఆశు షేర్ హర్యానా స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) మాజీ ఛైర్మన్ సత్యవాన్ షేరా భార్య.

గురుగ్రామ్‌లో బిజెపిపై ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలుపొందారు. ఇక్కడ బిజెపికి చెందిన నలుగురు గెలుపొందగా, ఐదు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలిచారు. సిర్సా జిల్లా పరిషత్‌లో 24 స్థానాలకు గాను ఐఎన్ఎల్‌డి 10, ఆప్ 6, బిజెపి 3, మెను బెనివాల్ మద్దతుతో నిలబడ్డ స్వతంత్రులు 2, కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేసిన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు, జెజెపి మద్దతుతో పోటీ చేసిన ఇండిపెండెంట్ అభ్యర్థి గెలిచారు.

జిందా జిల్లాలో 25 స్థానాలకు గాను ఆప్ ఒకటి గెలుచుకోగా, 24 మంది ఇండిపెండెంట్లు గెలిచారు. చర్కీ దాద్రీ జిల్లా పరిషత్‌లో 11 మంది స్వతంత్రులే గెలిచారు. ఫరీదాబాద్ జిల్లా పరిషత్‌లో పది మంది ఇండిపెండెంట్లు గెలిచారు. ఝజ్జర్ పంచాయతీలో జెజెపి 2, బిజెపి 2, కాంగ్రెస్ మద్దతుదారు 1 గెలుచుకోగా, 13 స్థానాల్లో ఇండిపెండెంట్లు గెలిచారు. అంబాలాలో 15 స్థానాలకు గానూ ఇండిపెండెంట్లు ఎనిమిది, ఆప్ మూడు, బిజెపి, బిఎస్‌పి చెరో రెండు స్థానాలను గెలుచుకున్నాయి. కురుక్షేత్ర జిల్లా పరిషత్‌లో 17 స్థానాలకు గానూ 13 ఇండిపెండెంట్లు గెలుపొందారు. మూడు స్థానాల్లో బిజెపి, ఒక స్థానంలో ఆప్ గెలిచాయి. యమునా నగర్ జిల్లా పరిషత్‌లో 18 స్థానాలకు గానూ ఇండిపెండెంట్లు 6, బిజెపి 6, బిఎస్‌పి 4, ఆప్ 1, ఐఎన్ఎల్‌డి 1 గెలుచుకున్నాయి. యమునా నగర్‌లో కాంగ్రెస్ నేత షమీమ్ ఖాన్ 8,280 భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇప్పటి వరకు వెలువడిన పంచాయతీల ఫలితాలను బట్టి ఇండిపెండెంట్లు 95, బిజెపి 58, కాంగ్రెస్ మద్దతుదారులు 26, జెజెపి 14, ఐఎన్ఎల్‌డి 6, ఆప్ 6, బిఎస్‌పి 5 గ్రామ పంచాయతీల్లో గెలిచారు.

జమాతే ఇస్లామీకి చెందిన రూ. 90 కోట్ల ఆస్తులు స్వాధీనం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని జమాతే ఇస్లామీకి చెందిన రూ.90 కోట్ల ఆస్తులను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంత్‌నాగ్ జిల్లాలో ఆ సంస్థకు సంబంధించిన 11 ప్రధాన ఆస్తులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ.90 కోట్లు ఉంటుందని అన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు అందిస్తోందని పేర్కొంటూ జమాతే ఇస్లామీ సంస్థపై కేంద్రం నిషేధం విధించిన సంగతి తెలిసిందే.



జవాన్ మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

సహోద్యోగులపై జవాన్ కాల్పులు : ఇద్దరు మృతి

అహ్మదాబాద్ : ఓ జవాన్ ఆగ్రహంతో తన సహోద్యోగులపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు మరణించగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన వచ్చేనెల ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జరిగింది. ఎన్నికల విధుల కోసం మణిపూర్‌కి చెందిన ఇండియా రిజర్వ్ బెటాలియన్ (ఐఆర్‌బి), సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్)లను గుజరాత్‌లో నియమించారు. శనివారం సాయంత్రం సమయంలో కానిస్టేబుల్స్ ఎస్.ఇనౌచాసింగ్, చోరాజిత్, రోహికానా జవాన్లు తోయిబా సింగ్, జితేంద్ర సింగ్‌ల మధ్య చిన్నపాటి ఘర్షణ తలెత్తింది. అది తీవ్రస్థాయికి చేరుకోవడంతో ఆగ్రహించిన ఇనౌచాసింగ్ ఎకె.47 రైఫిల్‌తో కాల్పులకు దిగినట్లు పోర్‌బందర్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శర్మ తెలిపారు. ఘర్షణకు దారితీసిన విషయంపై దర్యాప్తు చేపడుతున్నామని, ఆ సమయంలో వారు విధుల్లో లేరని అన్నారు.

చాగంటికి గురజాడ పురస్కారం అభ్యంతరకరం

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే కాదని, రెండు విరుద్ధ భావాల మధ్య ఘర్షణని పేర్కొన్నారు. స్త్రీలను అణగదొక్కే మూఢత్వాలను ప్రచారం చేసే చాగంటి లాంటి వ్యక్తులకు గురజాడ పురస్కారాన్ని ఇవ్వడమంటే మహాకవిని అవమాన పరచడమేనని తెలిపారు. ఇప్పటికైనా చాగంటి తనకు తానుగా గురజాడ పురస్కారాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే గురజాడ సాంస్కృతిక సమాఖ్య తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు.

వెనిజులా ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి మధ్య ఒప్పందం

అమెరికా ఆంక్షలతో నిలిచిన మానవతా సాయం



మెక్సికో : వెనిజులా ప్రభుత్వం పాలనలో ప్రజాస్వామ్య విధానాలకు పెద్దపీట వేస్తోంది. ప్రజల సంక్షేమ చర్యలకు సంబంధించి ప్రతిపక్షంతో కలిసి ప్రత్యేక ఒప్పందంపై సంతకాలు చేసింది. అమెరికా ఆంక్షల కారణంగా ప్రజారోగ్యం, విద్య, విద్యుత్ వంటి కీలక రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఆంక్షల వల్ల వివిధ దేశాల్లో వెనిజులా మానవతా సహాయానికి సంబంధించిన ఖాతాలు ఎక్కడికక్కడే స్థంభించిపోయాయి. ఈ నేపథ్యంలో ఖాతాలను పునరుద్ధరించి మానవతా సాయాన్ని ఖర్చు చేయడం ద్వారా విద్య, వైద్య, విద్యుత్ రంగాలకు పునరుజ్జీవం కల్పించేందుకు ప్రభుత్వం ప్రజాస్వామ్య మార్గాలను అనుసరిస్తోంది. ఈ క్రమంలోనే ప్రతిపక్షంతో ఇప్పటికే ఒక ఒప్పందాన్ని విజయవంతంగా చేసుకుంది. తాజాగా మెక్సికో విదేశాంగ శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం నాడు నిర్వహించిన ప్రొటోకాల్ కార్యక్రమంలో వెనిజులా ప్రజల రక్షణకు సంబంధించిన రెండో పాక్షిక ఒప్పందంపై అధికార, ప్రతిపక్షాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఇరు పక్షాల మధ్య చర్చల ప్రక్రియకు ఈ ఒప్పందం మార్గం సుగమం చేసింది. మెక్సికో విదేశాంగ మంత్రి మార్సెలో ఎబ్రార్డ్, నార్వే దౌత్యవేత్త డగ్ నేలాండర్ సమక్షంలో ఒప్పంద పత్రంలోని అంశాలు చదివి వినిపించారు.

విద్యుత్ గ్రిడ్లకు మరమ్మతులు, ఆరోగ్య రక్షణ పథకాల చెల్లింపులు వంటి మానవతా సాయానికి సంబంధించిన దాదాపు రూ.21600 కోట్ల (270 కోట్ల డాలర్లు) వ్యయ ప్రణాళిక అమలులో సహకారం వంటివి ఈ ఒప్పందంలో భాగంగా ఉన్నాయి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఈ నిధి మొత్తం ప్రస్తుతం పలు అంతర్జాతీయ ఖాతాల్లో స్థంభించివుంది. సహాయక ఆదాయ వనరులు ద్వారా జాతీయ ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేస్తామని, మౌలిక సదుపాయాలు, అత్యాధునిక యంత్రాలు సమకూరుస్తామని, ప్రజా పంపిణీ వ్యవస్థ మెరుగుపరుస్తామని, అలాగే టీకాల పంపిణీ, మందుల సరఫరా చేపడతామని వెనిజులా ప్రభుత్వం వారం కిందట ప్రకటించింది. వైద్యంతో పాటు విద్యా రంగాన్ని కూడా అభివృద్ధి చేయాల్సివుందని తెలిపింది. గ్రిడ్లకు మరమ్మత్తులు చేపట్టి విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం నొక్కి చెప్పింది. రుతుపవన వర్షాల వల్ల అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండేలా సహాయక వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సివుందని ప్రభుత్వం ప్రకటించింది. వీటన్నిటికీ ప్రతిపక్షం సహకారం కూడా ఎంతో అవసరమని తెలిపింది.

ఇండోర్ చేరుకున్న భారత్ జోడో యాత్ర

ఇండోర్ : కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మధ్యప్రదేశ్‌లో ఐదో రోజు అయిన ఆదివారం ఇండోర్‌కు చేరుకుంది. సమాజంలోని వివిధ తరగతులకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఈ యాత్రలో భాగస్వాములు అవుతున్నారు. ఆదివారం మనోహర్ అనే ఒక వికలాంగుడు రాహుల్‌తో కలిసి యాత్రలో పాల్గొన్నారు. ఆయన కూర్చున్న చక్రాల కుర్చీని కొంత దూరం రాహుల్ తోస్తూ కనిపించారు. దేశంలో మార్పు అవసరమని తాను రాహుల్ గాంధీతో చెప్పానని మనోహర్ తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జన్మస్థానమైన మొహ్వాలో రాత్రి బస చేసిన ఈ యాత్ర ఆదివారం ఉదయం కొనసాగింది. రావ్ మీదుగా కొనసాగిన ఈ యాత్ర ఇండోర్‌కు చేరుకుంది. ఈ యాత్రకు భద్రత కల్పించేందుకు 1400 మంది పోలీసులను మోహరించినట్లు ఇండోర్ పోలీసు కమిషనర్ హెచ్‌సి మిశ్రా తెలిపారు. జోడో యాత్ర ఇండోరుకు చేరుకోగానే నగరంలోని పలుచోట్ల బాంబు దాడులు చేస్తామంటూ ఈ నెల 17న ఇండోర్‌లోని ఒక మిఠాయి దుకాణానికి అజ్ఞాత వ్యక్తి నుంచి అందిన బెదిరింపు లేఖ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నగరంలోని ఖల్సా స్టేడియంలో రాహుల్ బస చేయనున్నారు. ఈ లేఖ నేపథ్యంలో ప్రణాళిక మార్చుకున్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.

అమెరికా అణు దాడుల నుంచి రక్షణ కోసమే

- బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలపై ఉత్తర కొరియా

సియోల్ : అమెరికా నుంచి పొంచివున్న అణు క్షిపణుల దాడులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండేందుకే అణ్వాయుధ క్షిపణులను పరీక్షించినట్లు ఉత్తర కొరియా అధ్యక్షులు కిమ్ జోంగ్ ఉన్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ మీడియా ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అమెరికాకు ధీటుగా ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అణుశక్తి దేశంగా ఎదగాలనేది తమ సైనిక లక్ష్యాల్లో అత్యున్నతమైనదని ఆయన పేర్కొన్నారు. ఉత్తరకొరియా ఇటీవల అతిపెద్ద బాలిస్టిక్ క్షిపణులను డజనుకు పైగా పరీక్షించినట్లు కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా అత్యంత శక్తివంతమైన హవసాంగ్ 17 ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసిబిఎం) పరీక్షా కార్యక్రమాన్ని కిమ్ జోంగ్ పరిశీలించారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజల గౌరవాన్ని పరిరక్షించుకోవడానికి అణ్వాయుధ సంపదపై ఆధారపడటం అవసరమని ఆయన తెలిపారు. అమెరికాకు ధీటుగా దాని అనైతిక చర్యలను తిప్పికొట్టేందుకు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అణు వ్యూహాత్మక బలగంగా మారాలనేది తమ అంతిమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

గోప్యత తూచ్

- అత్యవసర పరిస్థితుల్లో ప్రజలందరి వ్యక్తిగత సమాచారంతో ప్రభుత్వానికి యాక్సెస్
- కేంద్ర ఐటి శాఖ సహాయ మంత్రి వెల్లడి



రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ : ప్రజల వ్యక్తిగత గోప్యత హక్కుకు కేంద్ర ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడం ఖాయమని స్పష్టమవుతోంది. కేంద్ర ప్రతిపాదించిన డేటా ప్రొటెక్షన్ చట్టం కింద అత్యవసర పరిస్థితుల్లో ప్రజలందరి సమాచారం ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుందని తేలిపోయింది. అంటే ఆ పేరిట ప్రభుత్వం దేశ పౌరుల్లో ఏ ఒక్కరి వ్యక్తిగత గోప్యత సమాచారాన్ని అయినా పొందే వీలును ఈ చట్టం కల్పించనుంది. జాతీయ భద్రత, అంటువ్యాధులు విజృంభించినప్పుడు, ప్రకృతి విపత్తులు వంటి అత్యవసర ప్రత్యేక పరిస్థితుల్లో పౌరుల వ్యక్తిగత గోప్యత సమాచారం పొందే వెసులుబాటు కేంద్ర ప్రభుత్వానికి కచ్చితంగా ఉంటుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అనామక సమాచారాన్ని సైతం విశ్లేషించడం జాతీయ డేటా గవర్నెన్స్ ఫ్రైమ్‌వర్క్ పాలసీ లక్ష్యాల్లో ఒక్కటిగా ఆయన తెలిపారు. ఈ నిబంధన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) బిల్లు - 2022లో లేదన్నారు. డేటా రక్షణకు సంబంధించిన అంశాలను పరిష్కరించేందుకు ప్రతిపాదిస్తున్న డేటా ప్రొటెక్షన్ బోర్డు స్వతంత్రంగా పనిచేస్తుందని, అందులో ప్రభుత్వాధికారులు ఎవ్వరూ ఉండరని తెలిపారు.

ప్రభుత్వానికి సాధ్యమా?

ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడం ప్రభుత్వానికి సాధ్యపడుతుందా? అని ఒక ప్రశ్నకు బదులుగా మంత్రి బదులిచ్చారు. 'ప్రభుత్వం ఈ చట్టం ద్వారా పౌరుల గోప్యతకు భంగం కలిగించాలని కోరుకుందే అనుకుందాం. అది సాధ్యపడుతుందా? అది ప్రశ్నార్థకం. దానికి జవాబు 'కాదు' అనే. బిల్లులో చాలా స్పష్టంగా నిబంధనలు ఉన్నాయి. జాతీయ భద్రత, మహ్మామారి, ప్రకృతి విపత్తుల వంటి అత్యవసర ప్రత్యేక పరిస్థితుల్లోనే ప్రభుత్వం ప్రజల గోప్యత సమాచారాన్ని యాక్సెస్ చేయగలదు' అని ఆయన తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛ హక్కు అనేది ఎలాగైతే సహేతుక ఆంక్షలతో కూడ వుంటుందో అలాగే డేటా రక్షణ హక్కు కూడా అని ఆయన చెప్పారు. సహేతుక నిబంధనల పేరుతోనే కదానే నిరసన గళాలపైనా, ప్రజాస్వామ్య కార్యకర్తలపైనా తీవ్ర నిర్బంధం కొనసాగిస్తున్నదని విమర్శకులు విశ్లేషిస్తున్నారు.



యేల్ది హరిప్రసాద్‌ను ప్రశంసిస్తున్న ప్రధాని మోడీ

జి20లో భారత్ పాత్ర కీలకం

- మన్ కీ బాత్ లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జి20 కూటమిలో భారత్ పాత్ర కీలకం కానుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆ కూటమికి నాయకత్వం వహించడం దేశానికి దక్కిన గౌరవమని అన్నారు. ఆదివారం జరిగిన మన్ కీ బాత్ 95వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి మన దేశం జి-20 కూటమికి నాయకత్వం వహించబోతుందని చెప్పారు. మరోవైపు జి20 సభ్యదేశాలతో రాష్ట్రాలు వ్యాపార సంబంధాలు నెరవేలా ప్రత్యేకంగా చర్చలు జరుపుతామని మోడీ చెప్పారు. జి-20 అధ్యక్ష పదవి మనకు గొప్ప అవకాశంగా వచ్చిందని, ఈ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాల్సి ఉందని అన్నారు. తెలంగాణ సిరిసిల్లకు చెందిన నేతన్న యేల్ది హరిప్రసాద్‌ను ప్రశంసించారు. జి20లోగో మగ్గంపై నేసి తనకు పంపారని, ఈ అద్భుతమైన బహుమతిని చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. చేనేత కార్మికుల గొప్పదనాన్ని, కళా నైపుణ్యాన్ని వివరిస్తూ అభినందించారు. అంతరిక్ష ప్రయోగాల్లో భారత్ మరిన్ని విజయాలు సాధిస్తోందని అన్నారు. 'విక్రమ్-ఎస్' ప్రయోగంతో ప్రైవేట్ అంతరిక్ష రంగంలో కొత్త శకం ప్రారంభమైందని చెప్పారు. ఇండియన్ మ్యూజిక్ గ్రంథానికి ప్రపంచ వ్యాప్తంగా మంచి పేరొచ్చిందని, భారతీయ సంగీత పరికరాలను అనేక దేశాల్లో విక్రయిస్తున్నామని తెలిపారు.

జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి

- పార్లమెంట్‌లో బిల్లుకు కేంద్రం యోచన
- జనన, మరణాల డేటా అధికారం కేంద్రానికి బదలాయింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్య, ఉద్యోగం, పాస్‌పోర్టుకు కేంద్ర ప్రభుత్వం జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేసింది. ఇందుకోసం పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో జనన, మరణాల నమోదు చట్టం-1969కి సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ప్రజల అభిప్రాయాల కోసం బిల్లు ముసాయిదాను ఇప్పటికే విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందిన కొన్ని సూచనలు, మరికొన్నింటిని పరిగణనలోకి తీసుకుని సవరణలతో బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తుంది. డిసెంబర్ 7 నుంచి శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ బిల్లు ప్రకారం విద్యా సంస్థలు, ఓటు హక్కు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, వివాహ నమోదు, ప్రభుత్వ రంగ, స్థానిక ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాల కోసం జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని పేర్కొంది. ప్రస్తుత చట్టం ప్రకారం జనన మరణాల నమోదు తప్పనిసరి. పాఠశాల అడ్మిషన్ల వంటి ప్రాథమిక సేవలకు జనన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరి చేసింది.

జననమైనా, మరణమైనా బంధువులకు ఆసుపత్రులు ఇచ్చే సర్టిఫికెట్ కాపీని ఆయా ప్రాంతాల్లో రిజిస్ట్రార్‌కు ఇవ్వడం తప్పనిసరి చేసింది. వారం రోజుల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలి. సకాలంలో సమాచారం అందించకపోతే ఆసుపత్రులకు జరిమానా విధిస్తారు. జరిమానాను రూ.50 నుంచి రూ.1000కు పెంచారు. రిజిస్టర్ కార్యాలయాల నుంచి పొందిన ఈ సమాచారం కేంద్ర స్థాయిలో ఉంచుతారు. ఈ విధంగా 18 ఏళ్లు నిండిన తరువాత ఎవరి ప్రమేయం లేకుండా ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవడంతోపాటు ఎవరైనా మరణిస్తే పేరు తొలగించవచ్చు.

జనన మరణాల సమాచారం కేంద్రానికి

ఈ బిల్లు ఆమోదం పొందితే, ప్రస్తుతం రాష్ట్రాలు, స్థానిక సంస్థల వద్ద ఉన్న జనన మరణ డేటాను జాతీయ స్థాయిలో సేకరించేందుకు కేంద్రానికి అధికారం లభిస్తుంది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా ద్వారా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్)తో జనన, మరణ డేటా ఇప్పటికే సేకరించారు. అనేక రాష్ట్రాలు ఇప్పటికే సిఆర్ఎస్‌లో మొత్తం సమాచారాన్ని నమోదు చేస్తున్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్, కేరళతో సహా పదిహేను కంటే ఎక్కువ రాష్ట్రాలు ఇప్పటికీ తమ సొంత రిజిస్ట్రేషన్ వ్యవస్థలను ఉపయోగిస్తున్నాయి. సిఆర్ఎస్‌లో పాక్షిక సమాచారాన్ని అందించే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. కొత్త బిల్లు ఆమోదం పొందితే ఇవన్నీ కేంద్రానికి సమాచారం అందించాల్సి ఉంటుంది. జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌సిఆర్)ని సిద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ సమాచారాన్ని ఉపయోగించవచ్చు.

యాంటి బయాటిక్స్ వాడకంపై గైడ్‌లైన్స్

- వైద్యులు 'టైమ్‌లైన్' పాటించాలని ఐసిఎంఆర్ ఆదేశం

న్యూఢిల్లీ : యాంటి బయాటిక్స్ వాడకం ఎలా ఉండాలన్నదాన్ని వైద్యులకు తెలుపుతూ భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) గైడ్‌లైన్స్ విడుదల చేసింది. తక్కువ గ్రేడ్ జ్వరం, శ్వాసనాళాల వాపు (వైరల్ బ్రాంకైటీస్)తో బాధపడుతున్న రోగులకు యాంటి బయాటిక్స్ వాడరాదని ఐసీఎంఆర్ సూచించింది. తాజాగా విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొన్న 'టైమ్‌లైన్'ను అనుసరించి యాంటి బయాటిక్స్ మందులు రోగులకు రాయాలని పేర్కొన్నది. నిర్దిష్ట కాలపరిమితి లేకుండా వాడరాదని వైద్యుల్ని హెచ్చరించింది. చర్మ వ్యాధులు, సున్నితమైన కణజాలం ఇన్ఫెక్షన్లతో బాధపడే రోగులకు ఐదురోజులకు మించి యాంటి బయాటిక్స్ వాడరాదని తెలిపింది. న్యూమోనియా బాధితులకు ఐదు రోజులు, హాస్పిటల్‌లో ఉండటం మూలాన సంక్రమించినట్టయితే 8 రోజులు వాడాలని తెలిపింది. జనవరి 1-డిసెంబర్ 31, 2021 మధ్య ఐసీఎంఆర్ ఒక సర్వే చేపట్టగా, భారతదేశంలో పెద్ద సంఖ్యలో రోగులు కార్బపెనెమ్ అనే ఔషధం వాడటం వల్ల ప్రయోజనం పొందలేరన్నది గుర్తించింది. కార్బపెనెమ్ అత్యంత శక్తివంతమైన యాంటి బయాటిక్. అయితే దీని వాడకం పెద్ద ఎత్తున ఉండటంతో, బ్యాక్టీరియా, వైరస్‌లో డ్రగ్ రెసిస్టెన్సీ ఏర్పడింది. దీంతో అందుబాటులోని ఉన్న మిగతా మందులేవీ పనిచేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇదంతా కూడా ఇన్‌ఫెక్షన్ల చికిత్సను మరింత సంక్లిష్టంగా మార్చుతోంది. ఈ-కొలి బ్యాక్టీరియా చికిత్సలో వాడే 'ఇమైపెనెం' అనే ఔషధం డ్రగ్ రెసిస్టెన్సీ 2016లో 14శాతం ఉండగా, 2021నాటికి 36శాతానికి పెరిగింది. ఇష్టారీతిగా యాంటి బయోటిక్స్ వాడకం కొనసాగితే వాటిని తట్టుకొనే శక్తి బ్యాక్టీరియాలో, వైరస్‌లలో ప్రతి ఏటా పెరుగుతోందని, కాబట్టి తాజా గైడ్‌లైన్స్‌ను వైద్యులు కచ్చితంగా పాటించాలని ఐసీఎంఆర్ పేర్కొన్నది.



మీ కోసం

చలికాలంలో చర్మం పొడిబారకుండా ఉండడానికి గ్లిజరిన్ సబ్బులు వాడితే మంచిది.

జీవన సౌరభం

ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమే.. కృషితో మనం సంపాదించుకున్నదే శాశ్వతం.

నన్ను బతకనివ్వు



నేను ఈ భూమి ఆకాశం మధ్య
ఒక అందమైన అద్భుతలోకం నేను
అది నీకు తెలిసినా ఎందుకు?
తెలియనట్టు ప్రవర్తిస్తున్నావో
నాకు తెలియట్లేదు...

నేను ఈ భూమికి
పచ్చని సింధుర తిలకాన్ని
ప్రకృతి రమణీయతకు
శోభను కూర్చే కళారూపాన్ని
భూతల్లి గర్భం నుంచి
చిరు ప్రాణం పోసుకొని
ఈ లోకంలోకి వచ్చిన
ఒక తరువుని నీకొక ఆధారాన్ని!

సూర్యునితో పోరాడి
నీకు చల్లని నీడనిస్తున్నా
నేను వాయువుతో పోరాడి
నీకు ప్రాణ వాయువునిస్తున్నా
నేను మేఘంతో కలిసి
నీకు వర్షాన్నిస్తున్నా
నీకు తోడుగా తోబుట్టువుగా
నీతో ఉంటున్నాను కదా!!
నీ అవసరాలకు నీ సుఖాలకు
లేలేత చిగురుకొమ్మలని
కొమ్మచాటున రెమ్మలని
నా శరీరం లాంటి మొదులని
మొదులకు ప్రాణమైన వేర్లని

తల్లి నుంచి బిడ్డను
వేరు చేసినట్టు
ఈ భూమి నుంచి నన్ను
వేరు చేస్తున్నారు, న్యాయమా?
నీ నుంచి నన్ను నేను రక్షించుకుంటూ
నిన్ను రక్షిస్తున్న సంగతి మరిచి
నన్ను నువ్వు బతికుండగానే
చంపేస్తుంటే
నేనెలా బతకాలి నిన్నెలా బతికించాలి
నన్ను బతకనివ్వు
నా ఆశలు చిగిరించనివ్వు
ఓ మహా వృక్షమై
నిన్ను ఈ సమస్తాన్ని
నా కౌగిలి చేర్చుకొని
కంటి పాపల కాపుకాస్తా
నేనే కదా నీ ఆయువుని
అడుగడుగున నీ అవసరాలు
తీర్చే అమ్మలాంటి దాన్ని
నన్ను కాస్తా 'చిగురించనివ్వు' !


- లక్ష్మీ శ్రీనివాస్
96766 01192

నేను గీసిన బొమ్మ



ఆర్.పి. కళ్యాణి, 6వ తరగతి, ఎం.పి.యు.పి. స్కూలు, రామాయంపేట, మెదక్.





చుక్కలు కలపండి

చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మహిళలపై మతిమాలిన వ్యాఖ్యలా?

చాలా ప్రముఖులు అని, సమాజానికి మేలు చేసేవారని అనేకమంది చేత గౌరవం పొందుతున్న వ్యక్తులు కొందరు ... ఇటీవల మహిళల పట్ల చేస్తున్న వ్యాఖ్యలూ, వారి ప్రవర్తనా పద్ధతుల పట్ల ప్రదర్శిస్తున్న అసహనం ఆలోచనాపరులకు విస్మయం కలిగిస్తోంది. ఇలాంటి వారినా, సమాజం ఇంతకాలం గొప్ప వారిగా గుర్తిస్తోంది అని ఆశ్చర్యం కలుగుతోంది. మహిళలు సభలో ఉన్నా, వారి పక్కనే కూచొని ఉన్నా వెకిలి జోకులు వేస్తూ .. వారిని కించపరిచేలా మాట్లాడటాన్ని మహిళా సంఘాలూ, పౌర సంఘాలూ తీవ్రంగా తప్పపడుతున్నాయి.



మహిళల పట్ల ఏవిధంగా అమర్యాదగా ప్రవర్తించినా, అసభ్యత ప్రదర్శించినా అది చట్టరీత్యా నేరం. చేత ద్వారా కానీ, మాట ద్వారా కానీ, సైగ ద్వారా మహిళలను అవమానించటం శిక్షార్హం. మహిళలపై వేధింపులూ హింసా అరికట్టే దిశగా ఇలాంటి చట్టాలు ఎన్నో వచ్చాయి. కానీ, మహిళలను తక్కువగా చూసే, వారిని ఎక్కడికక్కడ జడ్జ్ చేసే భావజాలం ఇంటా బయటా యథేచ్ఛగా ఉత్పత్తి అవుతూనే ఉంది. సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తున్నామని చెప్పుకునే కొందరు బాబాలూ, స్వాములూ, ప్రవచనకర్తలూ స్త్రీలను కించపరిచే, తక్కువ చేసే భావాలను నిత్యం ప్రచారం చేస్తున్నారు. స్త్రీలు ఎలా మసలుకోవాలో మతగ్రంథాలు ప్రస్తావించిన విషయాలను వారు ఘనంగా ప్రబోధిస్తున్నారు. మరికొంత సొంత పైత్యం జోడించి, కించపరచటాన్ని నవ్వులాట జోకులుగా వదిలేస్తున్నారు. తాజాగా వ్యాపార యోగా గురువు రామ్‌దేవ్ బాబా ... స్త్రీ చీరకట్టుకున్నా, సల్వారు కమీజు వేసుకున్నా, అసలు బట్టలు లేకుండా అందంగా ఉంటారంటూ వందలాదిమంది మహిళలు ఉన్న సభలో వ్యాఖ్యానించాడు. ఈ మాటలపై దేశవ్యాప్తంగా ఆలోచనాపరుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. తెలుగు నాట ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు చాలా ప్రసంగాల్లో మహిళలపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తూనే ఉంటారు. స్త్రీల అలంకరణ మీద, జడ పొడవుగా ఉండడం పైనా, జుట్టు పొట్టిగా ఉండడం పైనా, వస్త్రధారణ మీదా ... ఇలా ప్రతి అంశంపైనా ఆయన కామెంటు చేస్తూనే ఉన్నారు. బాబాగా గౌరవం పొందుతున్న మరొక వ్యక్తి కూడా జుట్టు వదులుగా వదలిన భక్తురాలి మీద చెత్త వ్యాఖ్యానమే చేశాడు.

అసలు వీళ్లంతా ప్రవచనాల పేరిట చేయాల్సిన పనేమిటి? చేస్తున్నదేమిటి? సమాజంలోని నేరాలకు, ఘోరాలకు, అత్యాచారం వంటి అఘాయిత్యాలకు మహిళల వస్త్రధారణే కారణమని వ్యాఖ్యానించటం ద్వారా వీళ్ల సమాజానికి ఇస్తున్న సందేశం ఏమిటి? ఈ సభల్లో, మందిరాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న మహిళలు .. అవమానకరమైన మాటలు వింటూ ఎందుకు కూచుంటున్నారు? మత బోధనలో ఉన్న మతలబే ఇది. మనుషుల సహజ చైతన్యాన్ని కట్టడి చేసి, మహిళలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడడం అన్ని మతాల సారాంశం. అందుకనే ఏ మత బోధకుడూ, ప్రవచనకర్తా మహిళలకు చైతన్యాన్ని బోధించలేడు.



ఎంత ఎదురీత ఉన్నప్పటికీ నేడు అనేక రంగాల్లో మహిళలు ఎంతో ఎత్తుకు ఎదిగారు. నిరంతరంగా గొప్ప గొప్ప విజయాలు సాధిస్తూనే ఉన్నారు. వృత్తిజీవితంలో చూపిస్తున్న చైతన్యం, శక్తిసామర్థ్యాలూ మత సంబంధ అంశాలను అనుసరించాల్సి వచ్చినప్పుడు- పాత కాలపు మగాధిపత్య భావజాలమే పైచేయిని ప్రదర్శిస్తోంది. ఈ తేడాను గమనించటం, ఆధునిక కాలపు చైతన్యాన్ని ప్రదర్శించటం, ప్రశ్నించటం అందరి నుంచీ మొదలు కావాలి. స్త్రీ పురుష సమానత్వ భావాన్ని దెబ్బతీసే ఏ ప్రవచనాన్ని అయినా వ్యతిరేకించాలి. మాటల మాయాజాలంతో ఎన్ని భాష్యాలు చెప్పినా, మహిళలను అణగదొక్కి ఉంచటం మత బోధకుల నీతి! అది ఎక్కడ, ఎలా వ్యక్తమైనా ఆధునిక ఆలోచనాపరులు అడగాలి. నిలేయాలి.

ప్రవచనకారులైనా, ఏ మత బోధకులైనా మహిళల ఆహార, ఆహార్యాలపై ఎందుకు నిందాపూర్వక వ్యాఖ్యలు చేయాలి? అలా నిందించే, నిఘా పెట్టే అధికారం ఎవరిచ్చారు? వారు చేసిన వ్యాఖ్యల ఆధారంగా మనింటి ఆడబిడ్డలను ఎవరైనా అంచనా కడితే మనం ఊరుకుంటామా? మన ఇంటి అబ్బాయిలు ఆ వ్యాఖ్యల భరోసాతో తప్పుగా ప్రవర్తించి, తమను తాము సమర్థించుకుంటే సహిస్తామా? ఇలాంటి ప్రశ్న ఎవరికి వారు వేసుకోవాలి.

కాలాన్ని బట్టి, అవసరాలను బట్టి మన వస్త్రధారణ మారుతుంది. అలవాట్లు మారతాయి. స్త్రీలు ఉన్నత చదువులు చదివి, ఎన్నో రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. పెద్ద పెద్ద పదవుల్లో ఉన్నారు. ఆధునిక కాలానికి తగ్గట్టుగా, అనేక మార్పులు చెందుతున్నారు. పాత కాలపు కొలమానాలతో వారిని ఎందుకు చూడాలి? వేల ఏళ్ల కిందిట పురాణ ఇతిహాసాలతో ఎందుకు కొలవాలి? అందుకే తప్పుడు వ్యాఖ్యలు చేసినప్పుడు ఎంతటి మనిషినైనా తప్పుబట్టాలి. మంచి బాబా అనో, మంచి



ప్రవచనకర్త అనో, తాము అభిమానిస్తామనో ... మౌనం వహిస్తే- విపరీత వ్యాఖ్యలు ఇంకా ఇంకా పెరుగుతాయి. సమాజానికి నష్టం కలిగిస్తాయి.

మహిళలు ఈ సమాజంలో సగం. ఇంటా బయటా అన్ని పనుల్లో, అన్ని విధుల్లో వారి భాగస్వామ్యం ఎంతో ఘనం. ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది అని వందేళ్ల క్రితం చెప్పాడు గురజాడ. ఆధునిక మహిళ ఆ పనిలో ఇప్పుడు నిమగ్నమై ఉంది. తుచ్ఛమైన చూపులతో, నీచమైన వ్యాఖ్యలతో నిందిస్తూ ప్రవచించే హక్కు ఎవరికీ లేదు. ఆధునిక మహిళ సాధించుకున్న చట్టాల లెక్క ప్రకారం అది శిక్షార్హమైన నేరం. మహిళలను అవమానపరిచే జోకులకు నవ్వటం కాదు; అలా మాట్లాడ్డం తప్పు అని అక్కడికక్కడే అభ్యంతరం చెప్పటం అందరి నాగరిక బాధ్యత.





నాన్న ఇచ్చిన వాటిలో గొప్పది మీ ప్రేమే

మహేశ్‌బాబు

నాన్న తనకు చాలా ఇచ్చారని, వాటిలో గొప్పది అభిమానుల ప్రేమేనని నటుడు మహేశ్ బాబు పేర్కొన్నారు. ఇటీవల కన్నుమూసిన సూపర్‌స్టార్ కృష్ణ పెద్దకర్మను ఆదివారం కుటుంబ సభ్యుల మధ్య హైదరాబాద్‌లో నిర్వహించారు. పెద్దకర్మకు హాజరైన అభిమానులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. 'నాన్న ఎల్లప్పుడూ మన గుండెల్లోనే, మన మధ్యే ఉంటారు. మీరందరూ ఇక్కడకు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. మీ అభిమానం, ఆశీస్సులు నాపై ఇలాగే ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. నమ్రత, మంజుల, సుధీర్‌బాబు తదితరులు కృష్ణ చిత్రపటానికి నివాళి అర్పించారు.

మెస్సీ మ్యాజిక్

25 గజాల దూరం నుంచి గోల్



- 2-0తో మెక్సికోపై అర్జెంటీనా గెలుపు
- 2022 ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్

లుసైల్ (ఖతార్) : సాకర్ సూపర్‌స్టార్ లియోనల్ మెస్సీ తనదైన శైలిలో మరోసారి మ్యాజిక్ చేశాడు. మెక్సికోపై 2-0తో అర్జెంటీనాకు అద్వితీయ విజయాన్ని అందించాడు. ఫిఫా ప్రపంచకప్‌లో అర్జెంటీనాకు ఇదేమీ చిరస్మరణీయ విజయం కాకపోవచ్చు. కానీ గ్రూప్ దశ నుంచే నిష్క్రమించే ప్రమాదం ఎదుర్కొంటున్న తరుణంలో.. లియోనల్ మెస్సీ మాయజాలంతో అర్జెంటీనా అద్భుత విజయం నమోదు చేసింది. 64వ నిమిషంలో లియోనల్ మెస్సీ గెలుపు గోల్ నమోదు చేయగా, 87వ నిమిషంలో ఫెర్నాండేజ్ అర్జెంటీనా ఆధిక్యాన్ని పెంచాడు. బలమైన జట్టుపై మెక్సికో రాణించినా.. గోల్ చేసేంత స్థాయిలో ఆ జట్టు ఆట లేదు. గ్రూప్ దశ చివరి మ్యాచ్‌లో పోలెండ్‌తో అర్జెంటీనాతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో నెగ్గితే గ్రూప్-సి నుంచి అర్జెంటీనా అగ్రస్థానంతో నాకౌట్‌కు చేరుకునే అవకాశం ఉంది. బుధవారం జరుగనున్న అర్జెంటీనా, పోలెండ్.. మెక్సికో, సౌదీ అరేబియా మ్యాచులు గ్రూప్-సి నాకౌట్ బెర్తులు తేల్చనున్నాయి.

మెస్సీ మెరిసెన్ : గ్రూప్-సి ఆరంభ మ్యాచ్‌లో సౌదీ అరేబియాపై లియోనల్ మెస్సీ గోల్ కొట్టినా అర్జెంటీనా పరాజయం పాలైంది. ఆ ఓటమి మెస్సీ సేనపై ఒత్తిడి పెంచింది. మెక్సికోపై గత 11 మ్యాచుల్లో ఓటమెరుగని రికార్డు కలిగిన అర్జెంటీనా.. ఖతార్‌లోనూ అదే ప్రదర్శన పునరావృతం చేసింది. అయితే, ప్రథమార్థంలో అర్జెంటీనా ఎదురుదాడి చేసేందుకు సరైన సందర్భం రాలేదు. ఫౌల్స్, స్టాపేజ్‌లతో అర్జెంటీనా జోరు సాగలేదు. కానీ ద్వితీయార్థంలో అర్జెంటీనాకు మరిచిపోలేని గోల్ అందించాడు మెస్సీ. మెక్సికో గోల్‌పోస్ట్‌కు 25 గజాల దూరంలో ఉన్న లియోనల్ మెస్సీ.. డిమారియో నుంచి అందుకున్న పాస్‌ను ఒడుపుగా గోల్‌పోస్ట్ కార్నర్‌లోకి నెట్టేశాడు. మెస్సీ మ్యాజిక్ గోల్‌తో సుసైల్ స్టేడియం అర్జెంటీనా అభిమానుల అరుపులతో హోరెత్తింది. ఇక 87వ నిమిషంలో లియోనల్ మెస్సీ అందించిన పాస్‌ను ఫెర్నాండేజ్ గోల్‌గా మలిచాడు. అర్జెంటీనా ఆధిక్యం 2-0కు పెంచాడు. ప్రత్యర్థికి గోల్ ఇవ్వకుండా అర్జెంటీనా డిఫెన్స్ గొప్పగా నిలువరించింది. ఈ విజయంతో అర్జెంటీనా విలువైన 3 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. గ్రూప్-సిలో రెండో స్థానానికి ఎగబాకింది.

జగన్ పాలనలో ప్రజాస్వామ్యానికి అవరోధాలు

- మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, టిడిపి కార్యకర్తలు

జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యానికి అడుగడుగునా అవరోధాలు ఎదురవుతున్నాయని మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు విమర్శించారు. పోలీసుల తీరును ఖండిస్తూ ఆదివారం టిడిపి నాయకులతో కలిసి వారు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి, పరిటాల శ్రీరామ్ టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలోని స్థానిక కనేకల్లు రోడ్డులో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంగీకరించని, పశు భాషతో మాట్లాడిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి ఎందుకు చర్యలు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. తోపుదుర్తి సోదరులను టిడిపి కార్యకర్త గంటాపురం జగ్గు ప్రశ్నించినందుకు అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. టిడిపి కార్యకర్తలపై ఒక పక్క పోలీసులు, మరో పక్క వైసిపి నాయకులు దాడులు చేస్తే ఎక్కడికి వెళ్లి తలదాచుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ ఎదుటే వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలపై దాడులు చేయడం దారుణమన్నారు. పౌరుల కదలికలకు, స్వేచ్ఛకు భంగం కలిగించే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. సిఎం జగన్‌ను నమ్ముకుని పనిచేస్తున్న పోలీసు వ్యవస్థ భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తక్షణమే చెన్నేకొత్తపల్లి ఎస్ఐ, సిఐ లను సస్పెండ్ చేయాలని, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని, టిడిపి కార్యకర్తపై పెట్టిన తప్పుడు కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

చేనేత కార్మిక సమస్యలపై 15న ధర్నాలు

- జయప్రదానికి ఎపి చేనేత కార్మికసంఘం పిలుపు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15న అన్ని జిల్లా చేనేత జౌళి కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ కోరారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టిని విధించడం సరైంది కాదని అన్నారు. వంద శాతం పట్టునూలు ధరలను పెంచడంతో చేనేత రంగం తీవ్రసంక్షోభంలోకి పోయిందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం కూడా చేనేత కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. షెడ్ కార్మికులకు నేతన్న పథకాన్ని వర్తింపజేయకపోవడం సరైంది కాదని అన్నారు. చేనేత కార్మికులకు కేంద్రబడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు, రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. చేనేతకు వున్న 11రకాల రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. హెల్త్‌కార్డులను పునరుద్ధరించాలని అన్నారు. డిసెంబర్ 15న అన్ని జిల్లా జౌళి, చేనేత కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పాలా రామాంజనేయులు, నాయకులు కట్టా శివదుర్గారావు, వాసా గంగాధరరావు, కామర్తి రాజు పాల్గొన్నారు.

49 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం : 16 మంది అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిల్లా బి.మఠం మండలం మైదుకూరు-బద్వేల్ రహదారిలో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. లంకమల్ల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లు నరికి దుంగలుగా మార్చి వేరే ప్రాంతానికి తరలిస్తుండగా మైదుకూరు డిఎస్‌పి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఐచర్ లారీ, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తున్న 16 మందిని అరెస్టు చేశారని చెప్పారు. వారి వద్ద నుంచి 49 ఎర్రచందనం దుంగలు, ఎనిమిది సెల్ ఫోన్లు, మూడు రంపాలు, ఐదు రాళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



శ్రీకాకుళంలో సంతకాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఒపిఎస్‌ను అమలు చేయాల్సిందే..

- శ్రీకాకుళంలో సంతకాల సేకరణ
- పశ్చిమగోదావరిలో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దు చేయాలని, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆదివారం పలు చోట్ల నిరసనలు తెలిపారు. శ్రీకాకుళంలో సంతకాల సేకరణ, పశ్చిమ గోదావరి జిల్లాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. శ్రీకాకుళంలోని రైతు బజారు వద్ద చేపట్టిన సంతకాల సేకరణలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కార్పొరేట్లకు లాభాన్ని చేకూర్చే, ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే సిపిఎస్, జిపిఎస్ విధానాలను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి అయ్యాక జగన్మోహన్‌రెడ్డి తుంగలో తొక్కారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోగా సిపిఎస్ రద్దు చేయాలని ఉద్యమిస్తున్న ఉపాధ్యాయులపై కేసుల పేరుతో భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్‌తోపాటు మరి కొన్ని రాష్ట్రాల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పి, విధివిధానాలను రూపొందిస్తూ చట్టాలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 10కె వాక్ పేరిట ర్యాలీ నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రకాశం చౌక్, కొత్త బస్టాండ్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు, పోలీస్ బొమ్మ సెంటర్, ప్రకాశం చౌక్, అంబేద్కర్ సెంటర్, గాంధీ సెంటర్, నటరాజ్ థియేటర్ రోడ్డు మీదగా నుంచి తిరిగి యుటిఎఫ్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ.. తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్‌ను రద్దు చేస్తానని సిఎం జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి మూడున్నరేళ్లుగడుస్తున్నప్పటికీ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68